ఆదివారం
02-04-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 279
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

కరువు అంచున పాకిస్తాన్

50పళ్ల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం

పాకిస్తాన్‌లో ఆహార సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. పూటగడవని దారుణ పరిస్థితులు దాయాది దేశంలో ఉన్నాయి. ఏ ఏడాదికి ఆ ఏడు ద్రవ్యోల్బణం పెరుగుతోంది. 2023, మార్చిలో ఐదేళ్ల గరిష్ఠానికి చేరుకొని 35.37 శాతంగా నమోదైంది.

2 లో

విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ ప్రయత్నాలను

విరమించుకోవాల్సిందే

- లేనిపక్షంలో కార్మికాగ్రహం చవిచూడక తప్పదు
- ఏఐటీయూసీ రాష్ట్ర నేతలు ఓబులేసు, రవీంద్రనాథ్ హెచ్చరిక
- 700 రోజులకు చేరిన ఉక్కు పరిరక్షణ ఉద్యమం
- సంఘీభావంగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అనేక పోరాటాల ద్వారా తెలుగు ప్రజలు సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని, లేనిపక్షంలో కార్మికాగ్రహం చవిచూడాల్సి వస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ నగరంలో గాంధీ బొమ్మ వద్ద నిరసన దీక్షలు 700 రోజులకు చేరుకున్న సందర్భంగా, ఆ ఉద్యమానికి సంఘీభావంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట సమితి ఆధ్వర్యంలో కార్మికసంఘాలు రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళనా కార్యక్రమాలు చేపట్టాయి. దీనిలో భాగంగా విజయవాడలోని లెనిన్ సెంటర్‌లో నిరసన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ఏఐటీయూసీ విజయవాడ నగర కార్యదర్శి మూలి సాంబశివరావు, సీఐటీయూ నగర కార్యదర్శి సుధాకర్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించగా, ధర్నాను ఉద్దేశించి జి.ఓబులేసు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఇకనైనా కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ ఉద్యమం మరింత ఉధృతమవుతుందని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ను దొడ్డిదారిన బలహీన పరచటానికి మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్టీల్ ప్లాంట్‌కు గుండెకాయ లాంటి బ్లాస్ట్ ఫర్నెస్-3ను, 14 మాసాల నుంచి మూసేసి స్టీల్ ప్లాంట్‌లో అనేక విభాగాల్లో ఉత్పత్తి ఉద్దేశపూర్వకంగా తగ్గించిందన్నారు. ప్లాంట్ పూర్తి సామర్థ్యం తగ్గించడం వలన గత 11 నెలల్లో రూ.2,845 కోట్లు నష్టాలు వచ్చాయని తెలిపారు. ఇనుపఖనిజం, కోకింగ్ కోల్ ప్లాంట్లు కేటాయించకుండా అడ్డు పుల్లలు వేసిందన్నారు. ఏదో విధంగా నష్టాలు నమోదు చేయించడం ద్వారా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరించాలని చూస్తున్నదని విమర్శించారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాట కమిటీ చేసే ఉద్యమానికి రాష్ట్ర ఏఐటీయూసీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రావీంద్రనాథ్ మాట్లాడుతూ గత 26 నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పోరాటం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకోగల్గిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖస్తుతి కోసం రెండు సార్లు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేసి కేంద్రానికి పంపించిందన్నారు. 23 మంది అధికార పార్టీ పార్లమెంటు సభ్యులు లోక్‌సభలో ఉండి కూడా దీనిపై ఏనాడూ కేంద్రాన్ని నిలదీసిన దాఖలాల్లేవన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి యు.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని

- మిగతా 2 లో

దద్దరిల్లిన పుట్టపర్తి

టీడీపీ, వైసీపీ వర్గీయుల బాహాబాహీ

- అభివృద్ధి... అక్రమాలపై పరస్పరం సవాళ్లు
- రాళ్లు, టెంకాయలు, చెప్పలు విసురుకుంటూ దాడులు
- రెండు వర్గాల వాహనాలు ధ్వంసం
- యుద్ధ వాతావరణంతో బిక్కుబిక్కుమంటున్న జనం
- పల్లె, దుద్దుకుంట మధ్య రాజకీయ వేడి

విశాలాంధ్ర-బ్యూరో-అనంతపురం: పుట్టపర్తి ఒక్కసారిగా దాడులతో దద్దరిల్లింది. టీడీపీ, వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఒకరిపై మరొకరు తీవ్ర స్థాయిలో దాడులు చేసుకున్నారు. దీంతో ప్రశాంత పుట్టపర్తి ప్రాంతంలో భయానక వాతావరణం చోటుచేసుకుంది. టీడీపీ మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వర్గీయులు పరస్పరం రండిరా... దమ్ముంటే తేల్చుకోండి రా... అంటూ అవినీతి అక్రమార్జన పైన చర్చకు సిద్ధం అంటూ పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. రాళ్లు, చెప్పులు, టెంకాయలు విసురుకుంటూ దాడులు చేసుకోవడంతో పుట్టపర్తిలో యుద్ధ వాతావరణం ఏర్పడింది. సత్యమ్మగుడి వద్ద ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి. ఒకవైపు వైసీపీ వర్గీయులు, మరోవైపు టీడీపీ వర్గీయులు సత్యమ్మ గుడి దగ్గర రాళ్లు, చెప్పులు, టెంకాయలు విసురుకుంటున్న సందర్భంలో రెండు వర్గాల వారి వాహనాలు ధ్వంసమయ్యాయి. ఎన్నికల సమయం ఇంకా ఉన్నప్పటికీ పుట్టపర్తిలో రాజకీయ వేడి ముందే రగులుకుంది. వైసీపీ వర్గీయులు తొడలు కొట్టి మీసాల మెలేసి... రండిరా తేల్చుకుందాం అంటూ పిలుపు ఇవ్వడం, మీ అవినీతి అక్రమాల చిట్టా ఇదిగో చేతిలో ఉందంటూ టీడీపీ వర్గీయులు అవినీతి ఎమ్మెల్యే... అంటూ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డికి

- మిగతా 2 లో

ఎగువ భద్రతో

ఎడారిగా రాయలసీమ

- రాష్ట్రాల మధ్య చిచ్చు పెడుతున్న కేంద్రం
- ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికి వదిలేసిన సీఎం
- రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: కర్నాటక రాష్ట్రంలో ఎగువ భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణం జరిగితే రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆందోళన వ్యక్తంచేశారు. ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు జీవనాడి అయిన పోలవరం జాతీయ ప్రాజెక్టును పూర్తి నీటి సామర్థ్యంతో నిర్మించాలనీ, కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న ఎగువ భద్రా ప్రాజెక్టును ఆపాలని డిమాండ్‌చేస్తూ అనంతపురంలో అఖిలపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రామకృష్ణతోపాటు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలువ శ్రీనివాసులు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీశ్, సీనియర్ నాయకుడు ఎంవీ రమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దాదా గాంధి, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి పెద్దన్న, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటమయ్య తదితరులు పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ కర్నాటక అసెంబ్లీకి జరగనున్న ఎన్నికలలో లబ్ధికోసమే ఎగువ

- మిగతా 2 లో

చేతనైతే చర్చకురా

సజ్జలకు రామకృష్ణ సవాల్

విశాలాంధ్ర-అనంతపురంఅర్బన్: వందేళ్ల చరిత్ర ఉన్న భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)ని కించపరిచే విధంగా మాట్లాడే అర్హత రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. చేతనైతే చర్చకు రావాలని సవాల్ విసిరారు. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పై సజ్జల చేసిన వ్యాఖ్యలను రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. సీనియర్ నాయకుడు నారాయణ వ్యాఖ్యలపై చేతనైతే సజ్జల పరిశీలన చేసుకోవాలి గానీ పార్టీని కించపరిచేలా మాట్లాడటం మంచిది కాదన్నారు. సీపీఐని కించపరిచేలా మరోసారి సజ్జల మాట్లాడితే సహించేది లేదని రామకృష్ణ హెచ్చరించారు.



ఎండలే ఎండలు

- మండిపోనున్న ఏప్రిల్, మే, జూన్
- అధిక ఉష్ణోగ్రతలతో తప్పని ఉక్కపోత, వడగాడ్పులు
- ముఖ్యంగా 10 రాష్ట్రాల్లో భగభగలే
- భారత వాతావరణ శాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ: దేశంలో ఎండాకాలం మొదలైంది. రాత్రిళ్లు వాతావరణం కాస్త చల్లగా ఉన్నాగానీ మధ్యాహ్న సమయాల్లో ఉష్ణోగ్రతలు ఎక్కువగానే ఉంటున్నాయి. ఈ వేసవిలో ఎండలు మరింత ఎక్కువగా ఉంటాయని, సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ)

- మిగతా 2 లో

23లో 7.8 శాతం చిక్కిన రూపాయి

2లో

మన్యంలో

వరుస మరణాలు

- భయాందోళనలో ప్రజలు
- భూత వైద్యుల హడావిడితో మరిన్ని వదంతులు
- నాటు వైద్యానికి పరుగులు
- ఎట్టకేలకు వైద్య పరీక్షలు చేపట్టిన యంత్రాంగం

విశాలాంధ్ర బ్యూరో-అల్లూరి జిల్లా/పెదబయలు : మన్యంలో వరుస మరణాలు గిరిజనులను వణికిస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలంలోని మారుమూల కుంతర్ల పంచాయతీ కిండలం గ్రామంలో ఇటీవల చోటు చేసుకున్న వరుస మరణాలు ప్రజలు భయాందోళన గురిచేశాయి. సుమారు 250 మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో ఈనెల 19న తొమ్మిది నెలల పసికందు మృతి చెందింది. 22న కిముడు బోడం నాయుడు, 25న రక్తపు వాంతులతో కిముడు కృష్ణం నాయుడు, 26న విచిత్ర ప్రవర్తనతో కిమ్ముడు రామ్ నాయుడు, ఇవే లక్షణాలతో 27న రామన్న దొర, 29న ఈశ్వరమ్మ మృతి చెందారు. తొలుత ఒకరిద్దరు మరణించినప్పటికీ పెద్దగా పట్టించుకోని ప్రజలు వరుస మరణాలు చోటుచేసుకున్నాయని తెలియడంతో భయాందోళనకు గురయ్యారు. చేతబడులు, చిల్లంగి నెపంతో కొంతమంది భూత వైద్యులను, నాటు వైద్యులను సంప్రదించారు. మార్చి 31 నాటికి మరిన్ని వదంతులు వ్యాపించాయి. దీంతో గ్రామం అంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గ్రామంలోని నీరు కలుషితమైందంటూ వదంతులు జోరందుకున్నాయి. దీంతో ఎవరైనా మరణించినా బంధువులు రావడం మానేశారు. పిల్లలను పాఠశాలకు పంపడం ఆపేశారు. కొంతమంది ప్రజలు గ్రామం ఖాళీ చేసి చుట్టుపక్కల గ్రామాలకు వలస పోయారు. ఎట్టకేలకు స్పందించిన జిల్లా యంత్రాంగం నష్ట నివారణ చర్యలు ప్రారంభించింది. వైద్య బృందాలను గ్రామానికి తరలించి ప్రజల్లో భయాందోళనలు దూరం చేసే దిద్దుబాటు చర్యలకు పూనుకుంది.

సహజ మరణాలే వదంతులు నమ్మవద్దు : జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

పెదబయలు మండలం కుంతర్ల పంచాయతీ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అధికార 'భూమాయ'

- ఉమ్మడి విశాఖ జిల్లాలో జగనన్న కాలనీల భూసమీకరణలో అక్రమాలు
- అడంగల్ రికార్డుల్లో రైతుల పేర్లు తీసేసిన వైనం
- అధికార పార్టీ నేతల బినామీల పేర్లు చేర్పు
- అడ్డదారిలో అధికారుల అండ
- రోడెక్కిన భూములిచ్చిన రైతులు

అడుగులకు మడుగులొత్తే అధికారులు ఉంటే అధికార పార్టీ నేతలకు పండగే. జగనన్న కాలనీల ఏర్పాటులో కొంతమంది అధికార పార్టీ నేతలకు భారీ లబ్ధి చేకూరుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

2 లో

కరువు అంచున పాకిస్తాన్

50 ఏళ్ల గరిష్ఠానికి ద్రవ్యోల్బణం

అప్పుల ఊబిలో దేశం

ఐఎంఎఫ్ బెయిలౌట్‌పైనే ఆశలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లో ఆహార సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. పూటగడవని దారుణ పరిస్థితులు దాయాది దేశంలో ఉన్నాయి. ఏ ఏడాదికి ఆ ఏడు ద్రవ్యోల్బణం పెరుగుతోంది. 2023, మార్చిలో ఐదేళ్ల గరిష్ఠానికి చేరుకొని 35.37 శాతంగా నమోదైంది. బెయిలౌట్ ప్యాకేజీ కోసం ఆ దేశం అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)ని ఆశ్రయించింది. నెలసరి ద్రవ్యోల్బణం రేటు 3.72శాతం మేర ఉన్నట్లు శనివారం విడుదలైన ప్రభుత్వ డేటా చెబుతోంది. గడిచిన ఏడాదికి సంబంధించి సగటు ద్రవ్యోల్బణం రేటు 27.26శాతమని తెలిపింది. ఆర్థిక నిర్వహణ లోపం, రాజకీయ అనిశ్చితి పర్యవసానంగా పాకిస్తాన్ తీవ్రమైన ఆర్థిక-ఆహార సంక్షోభంలో కూరుకుపోవడంతో కరవు అంచనకు చేరుకుంటోందన్న ఆందోళన నిపుణుల్లో ఉంది. అంతర్జాతీయ చమురు సంక్షోభం, 2022లో వరదలతో దేశం అల్లాడిపోయింది. ప్రస్తుతం ఉన్న అప్పులను తీర్చేందుకు కొన్ని బిలియన్ల డాలర్ల ఆర్థిక సాయం అవసరం ఏర్పడింది. మరోవైపు విదేశీ మారక నిల్వలు ఖాళీ అయి రూపాయి క్షీణించింది. దీంతో పాకిస్తాన్‌లోని పేదల బతుకులు దుర్భరమయ్యాయి. రంజాన్ మాసం మొదలైనప్పటి నుంచి కనీసం 20 మంది ఆహార పంపిణీ కేంద్రాల వద్ద తొక్కిసలాటల్లో చనిపోయారు. శుక్రవారం కరాచీలోని ఓ స్వచ్ఛంధ సంస్థ చేపట్టిన ఉచిత రేషన్ పంపిణీ కార్యక్రమం విషాదాన్ని మిగిల్చింది. జనం ఎగబడటంతో తొక్కిసలాట జరిగి 12 మంది చనిపోయారు. అనేక మందికి గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు చిన్నారులు, ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. కరాచీలోని నౌరస్ స్క్వేర్ వద్ద ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి ఘటనలు ఈ మధ్యకాలంలో

ఎక్కువయ్యాయి. పాకిస్తాన్‌లో ఆహారంతో పాటు ఆర్థిక సంక్షోభం ముదురుతోంది. ఇప్పటికే అనేక కర్మాగారాలను మూసివేశారు. దీంతో ఉపాధి కోల్పోయిన నిరుపేదలకు పూట గడవడం కష్టమైంది. ప్రస్తుతం 20 కిలోల గోధుమ పిండి ధర 3000 పాకిస్తానీ రూపాయలు పలుకుతోంది.పాకిస్తాన్ ప్రభుత్వం కూడా ఉచితంగా గోధుమ పిండిని అందిస్తోంది. దీంతో చెదురుమదురు ఘటనలు జరుగుతున్నాయి. ద్రవ్యోల్బణం పెరుగుతున్న పద్ధతి చూస్తుంటే కరువు కోరల్లో దేశం చిక్కుకుంటుందన్న సంకేతాలు ఇస్తున్నట్లు కరాచీకి చెందిన విశ్లేషకులు షహీదా విజారత్ అభిప్రాయపడ్డారు. అయితే ఈ దక్షిణాసియా దేశంలో 220మిలియన్ల మంది ఉన్నారు. దేశం మాత్రం మెడలోతు అప్పులలో చిక్కుకుపోయి కఠిన పన్ను సంస్కరణలను తీచ్చి, దివాలా పరిస్థితిని నివారించేందుకు ఐఎంఎఫ్ బెయిలౌట్ ప్యాకేజీపై ఆశలు పెట్టుకుంది. నుంచి 6.5 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం లభిస్తే కష్టాల్లో నుంచి గట్టెక్కవచ్చని భావిస్తోంది. అయితే తాజా మార్కెట్ ఒడిదుడుకులను బట్టి ద్రవ్యోల్బణం స్థాయి పైపైనే కొనసాగనున్నట్లు విశ్లేషకులు అంచనా వేశారు. డిమాండుకు నిత్యావసరాల సరఫరాకు మధ్య తేడా, ఎక్స్ఛేంజ్ రేటు క్షీణత, పెట్రోల్, డీజిల్ ధరల్లో సవరణలతో పరిస్థితి మరింత జఠిలమైనట్లు వారు అభిప్రాయపడ్డారు.

ఎగువ భద్రతో ఎడారిగా రాయలసీమ

(మొదటిపేజీ తరువాయి)

భద్రా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అక్రమంగా నిర్మిస్తున్నారన్నారు. ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర జల కమిషన్ అనుమతులు సైతం లేవని చెప్పారు. ఎగువ భద్రా ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రజలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇంతజరుగతున్నా ఇటీవల బడ్జెట్ లో కేంద్ర ప్రభుత్వం ఎగువ భద్రా నిర్మాణానికి 5,300 కోట్ల రూపాయలు కేటాయించిందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారేగాని నిధులు మంజూరు చేయడం లేదని చెప్పారు. ఇప్పటివరకు పోలవరం ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన 2,900 కోట్లు కేంద్రం ఇవ్వాల్సివుండగా ఆ అంశాన్ని పట్టించుకోకుండా ఎగువ భద్రాకు 5 వేల కోట్ల పైచిలుకు నిధులు విడుదల చేయడం హేయమైన చర్య అన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రాల మధ్య చిచ్చు పెట్టి వ్యవస్థలన్నింటిని తుంగలో తొక్కుతున్నదని చెప్పారు. ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి దుర్మార్గంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం తీరును తీవ్రంగా తప్పుబట్టారు. .కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వాల స్వార్థ రాజకీయాలవల్ల హెచ్ఎల్‌సీ, ఎల్ఎల్‌సీ, శ్రీశైలం డ్యాం ద్వారా రాయల సీమకు వచ్చే నీటికి ఇబ్బందులు ఎదురౌతున్నాయని చెప్పారు. తుంగ భద్రా నుంచి శ్రీశైలం డ్యాం కు వచ్చే అదనపు నీరు ఆగిపోయే ప్రమాదం ఉందన్నారు. దీంతో రాయలసీమ ప్రాంతం ఎడారి కాబోతోందన్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టులను గాలికి వదిలేసిందనీ, కావలసిన నిధులు విడుదల చేయకపోగా ఉన్న నిధులను సైతం సక్రమంగా ఖర్చు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల సత్వర నిర్మాణం కోసం ప్రభుత్వం పై ఒత్తిడి పెంచేందుకు అన్ని వర్గాల ప్రజలు సమాయత్తం కావాలని రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకుడు న్యాయవాది ఐదుకల్లు రవీంద్ర,ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ సాకే హరి తదితరులు పాల్గొన్నారు.

ఎండలే ఎండలు

(మొదటిపేజీ తరువాయి)

హెచ్చరించింది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎండలు బాగా కాస్తాయని శనివారం నిర్వహించిన వర్చువల్ విలేకరుల సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఈ మూడు నెలల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించారు. ఉక్కపోత, వడగాడ్పులు తప్పవన్నారు. దక్షిణ, వాయువ్యంలోని కొన్ని ప్రాంతాలు మినహా అనేకచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు. ముఖ్యంగా బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, బంగాల్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్, పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరగవచ్చని మహాపాత్ర తెలిపారు. వాయవ్య, మధ్య, ద్వీపకల్ప ప్రాంతాల్లోని చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందని, తూర్పు, ఈశాన్య భారతంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా సూచించింది. ఇదిలావుంటే, ఇప్పటికే 1901 నుంచి లేనంత అధిక ఉష్ణోగ్రతలు నమోదైన నెలగా ఫిబ్రవరి నిలిచిందని ఐఎండీ వెల్లడించింది. 121 ఏళ్లల్లో మూడవ పొడిబారిన ఉష్ణమాసంగా గతేడాదిలో మార్చినెల నమోదైంది. గతనెలలో 37 ఉష్ణకార్యచరణ ప్రణాళికలు (హెచ్ఏపీల)పై విధానపరమైన పరిశోధన కేంద్రం (సీపీఆర్) జరిపిన సమీక్ష ద్వారా అధికారులకు సముచిత సమాచారం ఉండటం లేదని వెల్లడి అయింది. కాగా ఏప్రిల్‌లో సాధారణ వర్షపాతం ఉంటుందని ఐఎండీ తెలిపింది. 1971 నుంచి 2020 వరకు దేశంలో సగటున 39.2 ఎంఎంల వర్షపాతం ఏప్రిల్ నెలలో నమోదైందని డేటా చెబుతోంది. ఎన్‌సో తటస్థ పరిస్థితులు ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉంటాయని పేర్కొంది. వేసవి కాలం రావడంతో విద్యుత్ వినియోగం కూడా పెరిగింది. దీంతో ప్రమత్తమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో పనిచేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నాయి.

ప్రచండ కేబినెట్‌లో 11 మంది కొత్త మంత్రులు

మూడోసారి మంత్రివర్గ విస్తరణ

ఖాట్మండు: నేపాల్‌లో కొత్త మంత్రివర్గం కొలువుదీరింది. పదవిలోకి వచ్చిన అల్పకాలంలోనే ప్రధాని పుష్పకమల్ దహల్ ప్రచండ తన కేబినెట్‌ను మూడుసార్లు పునర్వ్యవస్తీకరించారు. పది పార్టీల పాలక పక్షం కావడంతో మంత్రిత్వశాఖలపై చివరి వరకు సాగిన తర్జనభర్జన తర్వాత 11మంది కొత్త మంత్రులకు స్థానం కల్పించారు. ఇన్నిసార్లు కేబినెట్‌లో మార్పులు, చేర్పులు చేసినప్పటికీ అది పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోలేదు. కాగా, శీతల్ నివాస్‌లో కొత్త మంత్రుల ప్రమాణస్వీకారోత్సవం అధ్యక్షుడు రామచంద్రపౌడెల్ అధ్వర్యంలో జరిగింది. కొత్త కేబినెట్‌లో ఇద్దరు ఉప ప్రధానులు పూర్ణ బహదూర్ ఖడ్కా (నేపాలీ కాంగ్రెస్), నారాయణ్ కాజి శ్రేష్ఠ (సీపీఎన్-మావోయిస్ట్ సెంటర్), 13 మంది మంత్రులు, ఒక సహాయ మంత్రి ఉన్నారు. ఖడ్కాకు ఉప ప్రధాని పదవితో పాటు రక్షణ మంత్రిత్వశాఖను కట్టబెట్టారు. శ్రేష్ఠకు హోంశాఖ అప్పగించారు. నేపాలీ కాంగ్రెస్ నలుగురు మంత్రులకు కీలక శాఖలు దక్కాయి. ప్రకాశ్ శరణ్‌మహత్‌కు ఆర్థిక శాఖ, రమేశ్ రిజల్‌కు పరిశ్రమలు, వాణిజ్య శాఖ, సీతాగురుంగ్‌కు పట్టణాభివృద్ధి శాఖల బాధ్యతలు స్వీకరించారు. అలాగే సీపీఎస్-యునైటెడ్ సెంటర్‌కు చెందిన ఇద్దరు మంత్రులలో వేదురాం భూషల్‌కు వ్యవసాయ శాఖ, ప్రకాశ్ జ్వాలాకు రవాణా శాఖ లభించగా విదేశాంగ, న్యాయ, పార్లమెంటరీ వ్యవహారాలు తదితర శాఖలు ఇంకా ఖాళీగానే ఉన్నాయి.

భారతీయ కుటుంబంతో సహా 8 మంది జలసమాధి

టొరంటో: ఉపాధి కోసం వలస వెళ్లి ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. నదుల గుండా ప్రయాణిస్తూ జలసమాధి అవుతున్నారు. ఇదే తరహాలో ఓ భారతీయ కుటుంబంతో సహా ఎనిమిది మంది నదిలో మునిగి చనిపోయారు. తాజాగా రెండు మృతదేహాలు లభ్యం కావడంతో కెనడా నుంచి అమెరికాలోకి అక్రమంగా ప్రవేశించేందుకు సెయింట్ లారెన్స్ నది మార్గంలో వెళ్లి మునిగి చనిపోయిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. మృతుల్లో భారతీయ కుటుంబ సభ్యులు ఉన్నట్లు కెనడా పోలీసులు తెలిపారు. ఆరుగురు పెద్దలు, ఇద్దరు మూడేళ్లలోపు చిన్నారులు ఉన్నట్లు వెల్లడించారు. పిల్లలకు కెనడా పౌరసత్వం ఉందన్నారు. చనిపోయినది రొమేనియా, భారతదేశానికి చెందిన కుటుంబాలన్నారు. అక్వెసాస్నేలోని మోహహ్క్ సరిహద్దు-క్యూబెక్ పరిధిలోని సెయింట్ లారెన్స్ నదిలో శుక్రవారం మృతదేహాలను ఆలస్యంగా గుర్తించినట్లు స్థానిక డిప్యూటీ పోలీసు చీఫ్ లీ-ఆన్ ఓ'బ్రియన్ తెలిపారు. మరొకరి ఆచూకి లేదని చెప్పారు. ఇలాంటివి కొత్తేమీ కాదని అక్వెసాస్నే మోహాక్ పోలీసు చీఫ్ షాన్ దులుండె వెల్లడించారు. మృతులందరినీ గుర్తించి వారి కుటుంబాలకు సమాచారం అందజేసే ప్రక్రియను కెనడా ఇమిగ్రేషన్ అధికారులు కొనసాగిస్తున్నట్లు చెప్పారు. నదిలో గస్తీ పెంచినట్లు వెల్లడించారు.

23లో 7.8 శాతం చిక్కిన రూపాయి

న్యూఢిల్లీ: 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూపాయి 7.8శాతం మేర క్షీణించింది. 2022లో రూపాయి 10శాతం కంటే ఎక్కువగా పతనమైంది. అన్ని ఆసియా కరెన్సీల కంటే అధ్వాన్నంగా రూపాయి ఉంది. 2023 ఆర్థిక సంవత్సరానికి డాలర్‌తో పోల్చితే 82.18 వద్ద ముగిసింది. గతేడాది ఇదే సమయానికి 75.79గా ఉంది. అక్టోబరులో అత్యల్పంగా 83.28కి చేరుకుంది. అయితే నాల్గవ త్రైమాసికంలో కరెంట్ ఖాతా లోటు మిగులుగా మారడంతో రూపాయి విలువ పెరగడం ప్రారంభమైంది. భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) జోక్యంతో జనవరి ప్రారంభంలో అక్టోబరు తరహా పతనాన్ని నిరోధించే అవకాశం కలిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి చైనా, దక్షిణ కొరియా, మలేసియా, ఫిలిప్పీన్స్ దేశాల కరెన్సీల కంటే రూపాయి పరిస్థితి మెరుగ్గా ఉంది. 2022లో 10.14శాతం వద్ద ఆసియా కరెన్సీల్లో అధ్వాన్నంగా నిలిచింది. 2013 తర్వాత రూపాయి అధిక వార్షిక క్షీణతను ఆ సంవత్సరం నమోదు చేసింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా పెరిగిన చమురు దిగుమతి వ్యయానికి తోడు దేశీయ ద్రవ్యోల్బణం, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేటు పెరగడం వంటివి రూపాయిని తీవ్ర ఒత్తిడికి గురిచేశాయి. మార్చి నెలారంభంలో జరిగిన 34 మంది విదేశీ మారకద్రవ్య వ్యూహకర్తల రాయిటర్స్ పోల్ ప్రకారం భారతీయ రూపాయి వచ్చే మూడు నెలలు ఇదే స్థాయిలో ఉంటుందని వెల్లడైంది.

అధికార 'భూమాయ'

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : అడుగులకు మడుగులొత్తే అధికారులు ఉంటే అధికార పార్టీ నేతలకు పండగే. జగనన్న కాలనీల ఏర్పాటులో కొంతమంది అధికార పార్టీ నేతలకు భారీ లబ్ధి చేకూరుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విశాఖ జిల్లాలో జగనన్న కాలనీల కోసం పద్మనాభం మండలంలో భూములు ఇచ్చిన తమ పేర్లను మార్చేశారనే ఆవేదనతో రైతులు రోడ్డెక్కారు. అధికార పార్టీకి చెందిన అనేక మంది నేతలు, వారి కుటుంబ సభ్యులు, అనుయాయుల పేర్లు పొందుపరిచారని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. భూములు ఇచ్చిన రైతుల పేర్లతో కూడిన జాబితా ఇవ్వడానికి పద్మనాభం మండల తహసీల్దార్ కార్యాలయ అధికారులు నిరాకరిస్తుండడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోందని రైతులు అంటున్నారు. అత్యంత ఖరీదైన ప్రాంతాల్లో జగనన్న కాలనీలు పేరుతో కొంతమంది అధికార పార్టీ నేతలకు భారీ లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జగనన్న కాలనీల కోసం ఉమ్మడి విశాఖ జిల్లాలో భీమిలి, ఆనందపురం, పద్మనాభం, పెందుర్తి, పరవాడ, సబ్బవరం, పెదగంట్యాడ, విశాఖ రూరల్, అనకాపల్లి మండలాల నుంచి 6,115 ఎకరాలు సమీకరించాలని 2020 జనవరి 25న ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములతో పాటు అసైన్డ్/రైతుల ఆక్రమణలో ఉన్న భూములు తీసుకోవాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా పద్మనాభం మండలంలో 23.47 ఎకరాలు అసైన్డ్ భూములు, పీవోటీ భూములు 3.29 ఎకరాలు, రైతుల ఆక్రమణలో ఉన్న 391.23 ఎకరాలు, ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు 97.96 ఎకరాలు కలిపి మొత్తం 515.95 ఎకరాలు సమీకరించారు. అయితే భూసమీకరణ చేపట్టినప్పుడు అడంగల్ రికార్డు ఆధారంగా తీసుకుంటారు. అసైన్డ్ భూమికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చే పట్టాతో పాటు పాస్ పుస్తకం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదవుతుంటాయని, ఆక్రమణ భూముల వివరాలకు కేవలం గ్రామాల అడంగల్ రికార్డులను ప్రామాణికంగా తీసుకుంటారని అనేక మంది రైతులు వివరించారు. గతంలో ఏటా గ్రామాల వారీగా జమాబందీ పేరిట భూముల రికార్డులను తనిఖీ చేసేవారని, ఆ సంవత్సరంలో గ్రామంలో కొత్తగా ఎవరైనా ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నారని గ్రామ పాలనాధికారి నిర్ధారిస్తే వెంటనే మెమో జారీచేసి సదరు రైతు నుంచి కొంత మొత్తం కట్టించుకుని రశీదు ఇచ్చేవారన్నారు. దీంతో సదరు భూమిలో రైతును ఆక్రమణదారుడిగా గుర్తించి అడంగల్‌లో నమోదు చేసేవారని, జమాబందీ నిర్వహించినప్పుడు అడంగల్‌లో మార్పులు, చేర్పులు జరిగేవని రైతులంటున్నారు. ఈ ప్రక్రియ దాదాపు రెండు దశాబ్దాల నుంచి జరగడం లేదన్నారు. అందువల్ల ఆక్రమణదారుల విషయంలో 2000 సంవత్సరాని కంటే ముందు ఉండే అడంగల్ రికార్డులే ఆధారమని, దీని ఆధారంగానే భూసమీకరణ అధికారులు చేపట్టారని తెలిపారు. పద్మనాభం మండలంలో గ్రామాల వారీగా జాబితాలు రూపొందించేటప్పుడు అధికార పార్టీ నేతలతో కుమ్మక్కై అధికారులు అడంగల్ రికార్డులు మార్చేశారని రైతులు ఆరోపిస్తున్నారు. నరసాపురం, రెడ్డిపల్లి, కొవ్వాడ, గంధవరం గ్రామాల్లో ఎక్కువగా ఇటువంటి గోల్‌మాల్ వ్యవహారం జరిగిందని రైతులు ఫిర్యాదు చేస్తున్నారు. రికార్డుల్లో రైతుల పేర్లు మార్చారని, సాగు విస్తీర్ణాన్ని తగ్గించి, వారు సూచించిన వ్యక్తుల పేర్లను ఆక్రమణదారులుగా నమోదు చేశారని అర్హులైన రైతులు ఆరోపిస్తున్నారు. భూసమీకరణ సమయంలో తీసుకున్న భూములకు తగ్గట్టుగా ప్లాట్లు కేటాయించకపోవడంతో అసలు విషయం బయట పడిందన్నారు. రైతుల జాబితా, అడంగల్ రికార్డుల వివరాలు అడుగుతున్నా తెలియజేసేందుకు పద్మనాభం ఇన్‌ఛార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన వేణుగోపాల్, కార్యాలయం సిబ్బంది నిరాకరిస్తుండడంతో అక్రమాలు జరిగినట్లు తాము నిర్ధారణకు వచ్చామని రైతులు ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా సందర్భంగా ఆరోపించారు. తొలుత ఆనందపురం మండల తహసీల్దార్‌గా పని చేసి తర్వాత భీమిలి మండల తహసీల్దార్‌గా నియామకం అయిన ఆయనికే ఖాళీగా ఉన్న పద్మనాభం మండల తహసీల్దార్ బాధ్యతలు కొన్ని నెలలుగా అప్పగించారు. ఈ తహసీల్దార్‌పై అనేక ఆరోపణలు గతంలో వెల్లువత్తాయి. అధికార పార్టీలో అనేక మంది మంత్రులకు ఆప్తమిత్రుడుగా ఈ అధికారి వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. సోమవారం స్పందన సందర్భంగా విశాఖ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడతామని, కలెక్టర్‌కి లిఖితపూర్వకంగా తమ ఫిర్యాదు అందజేస్తామన్నారు.

ల్యాండ్ పూలింగ్ రికార్డులను పరిశీలిస్తా : జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్

పద్మనాభం మండలంలో జగనన్న కాలనీలకు అవసరమైన భూసమీకరణలో జరిగిన అవకతవకలపై, రైతుల ఆందోళనపై జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ సీరియస్ అయ్యారు. భూసమీకరణకు సంబంధించి రికార్డులు తీసుకుని రావాలని ఇప్పటికే మండల రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మండలంలో నరసాపురం, రెడ్డిపల్లి, గంధవరం, కొవ్వాడ గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన కొంతమంది నేతలు, వారి బినామీల పేర్లను అధికారులు భూములు ఇచ్చిన వారి జాబితాలో చేర్చారన్న ఆరోపణలపై జేసీ విచారణ చేపట్టనున్నారు. ఇంకా రైతులు ఇచ్చిన దానికంటే తక్కువ విస్తీర్ణం చూపించి, మిగతాది అధికార పార్టీ నేతల పేరిట నమోదు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని, వీటన్నింటిపై పూర్తిస్థాయిలో రికార్డుల పరిశీలన చేస్తామని జేసీ ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులకు తెలిపారు. అధికార పార్టీ నేతల కుటుంబీకులకు తునివలసలో ప్రధాన రహదారికి ఆనుకుని ప్లాట్లు కేటాయింపులో పద్మనాభం తహసీల్దార్ కార్యాలయ అధికారులు, కొందరు సిబ్బంది పాత్ర ఉన్నట్లు ఫిర్యాదులు రావడంతో పూర్తిస్థాయి విచారణకు జేసీ నిర్ణయించారు. దీంతో పద్మనాభం మండలం రెవెన్యూ అధికారుల్లో గుబులు మొదలయింది. తాజాగా నూతన తహసీల్దార్‌గా సీసీఎల్ఏ నుంచి వచ్చిన టి.శ్రీవల్లిని నియమించామని, పూర్తిస్థాయి తహసీల్దారుగా ఆమె పని చేస్తారని, ల్యాండ్ పూలింగ్‌లో రికార్డులను పరిశీలించి తప్పులు జరిగితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని జేసీ తెలిపారు.

మన్యంలో వరుస మరణాలు

(మొదటిపేజీ తరువాయి)

కిండలం గ్రామంలో ఇటీవల జరిగిన మరణాలన్నీ సహజ మరణాలేనని వైద్యులు ధ్రువీకరించినందున ఆ గ్రామంలోని ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మరణించిన వారిలో ఒకరికి 73 సవత్సరాలని, ఆయన కార్డియో మెగాలి వల్ల మరణించారని, మరొకరు ఈ నెల 26 నుంచి రక్త విరోచనాలతో బాధ పడుతున్నప్పటికీ నాటు వైద్యాన్ని ఆశ్రయించారని, పరీక్షించగా సీవోపీడీతో మరణించినట్టు గుర్తించటం జరిగిందన్నారు. అదేవిధంగా మరో వ్యక్తికి ఫిట్స్ వచ్చి హెమరేజిక్ స్ట్రోక్‌తో ఇంటి వద్దే మరణించారని, మరో వ్యక్తి అధిక రక్తపోటుతో బాధ పడుతున్నారని, ఒక మహిళ అధిక రక్తపోటుతో బాధ పడుతున్నట్లు గుర్తించి చికిత్స అందించాలని ప్రయత్నించినా ఆమె న్యూమోనైటిస్‌తో మరణించిందని తెలిపారు. మరో వ్యక్తి చెట్టు మీద నుంచి కింద పడిపోవటంతో మృతి చెందారన్నారు. ఎనిమిది నెలల చిన్నారికి ఫిట్స్ రావటంతో పాటు హైపో గ్లాసిమియాతో మరణించినట్లు తెలిపారు.

గ్రామంలో కేంద్ర వైద్య బృందం పర్యటన

కిండలం గ్రామంలో వరుస మరణాలపై శనివారం కేంద్ర వైద్య బృందం, జిల్లా వైద్యులు పర్యటించారు. గ్రామ ప్రజలతో మమేకమై మూఢనమ్మకాల నుంచి విముక్తి పొంది వైద్యం పొందాలని సూచించారు. మరణాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర వైద్య బృందం డైరెక్టర్ రామిరెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. గ్రామంలో వారం రోజులు వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో ఎక్కువమంది చుట్ట బీడీ, కైని, జీలుగు కల్లు వంటివి వాడడం వలన అధిక సంఖ్యలో రక్తపోటుకు గురవుతున్నారని తెలిపారు. గ్రామంలో 84 మందికి రక్తపోటును చెక్ చేయగా 25 మందికి ఉందని తెలిపారు. రోజు తప్పించి రోజు ప్రతి ఒక్కరికి రక్తపోటును పరీక్షించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏడీఎంహెచ్‌వో జమల్ బాషా, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ సర్వేశ్వరరావు, ఎన్‌వీబీడీ ఎస్ శ్రీనివాసరావు, టి.సాంబమూర్తి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, మాజీ సర్పంచ్ సింహాచలం, జడ్పీటీసీ బొంజు బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంటా సూర్యనారాయణ, మండల బూత్ కన్వీనర్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

దద్దరిల్లిన పుట్టపర్తి

(మొదటిపేజీ తరువాయి)

వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇంతలో పోలీసులు రావడం... రెండు వర్గాలను చెదరగొట్టే ప్రయత్నంలో ఒకింత వైసీపీకి అనుకూలంగానూ టీడీపీకి వ్యతిరేకంగానూ వ్యవహరిస్తున్నారంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ధర్నాకు దిగారు. ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న ఆందోళనకర పరిస్థితి ఏర్పడింది. లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఓడీసీ బహిరంగ సభలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిపై అవినీతి ఆరోపణలను ప్రస్తావించిన నేపథ్యంలో శ్రీధర్ రెడ్డి తీవ్రంగా స్పందించి తాను చేసిన అభివృద్ధి గురించి మీడియాకు వివరించారు. పట్టణంలోని సత్యమ్మ గుడి దగ్గరకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి రావాలని, ఇద్దరం ప్రమాణం చేద్దామని లేదా టీడీపీ కార్యాలయం వద్దకు రావాలా, లోకేశ్ పాదయాత్ర క్యాంపునకు రావాలో చెప్పాలని సవాలు చేశారు. దీంతో మాజీ మంత్రి పల్లె శనివారం సత్యమ్మ గుడి వద్దకు రావాలని... పుట్టపర్తి నియోజకవర్గంలో ఎవరు అభివృద్ధి చేశారో, ఎవరు దోచుకోన్నారో తేల్చుకొందామని ప్రతి సవాలు చేశారు. అప్పటి నుంచి రెండు పార్టీల మధ్య కుంపటి రాజుకుంది. అయితే శుక్రవారం రాత్రి పోలీసులు నియోజకవర్గంలో పోలీస్ యాక్ట్ 30 విధించామని, ఎవరు సత్యమ్మ గుడి వద్దకు రాకూడదని హెచ్చరించారు. టీడీపీ కార్యాలయం వద్ద పల్లెను, ఇతర ముఖ్య నాయకులను శనివారం ఉదయమే గృహ నిర్బంధం చేశారు.

అయితే పోలీసుల కళ్లు గప్పి ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి వాహనం టీడీపీ కార్యాలయం ముందు నుంచి కేకలు వేసుకుంటూ సత్యమ్మ గుడి వద్దకు చేరుకుంది. దీంతో టీడీపీ కార్యాలయంలో నిర్బంధంలో ఉన్న పల్లె రఘునాథ రెడ్డి కార్యాలయం వెనుక వైపు పైకప్పు నుంచి క్రింద ఉన్న షెడ్డు పైకి దూకి కారులో సత్యమ్మ గుడికి చేరుకున్నారు. దీంతో అక్కడ వైసీపీ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు చెప్పులు, రాళ్లు, టెంకాయలతో పరస్పరం దాడులు చేసుకున్నారు. రెండు వర్గాల వాహనాల అద్దాలు పగిలాయి. పోలీసులు అక్కడికి చేరుకొని రెండు వర్గాల వారిని చెదరగొట్టారు. ఇదంతా పోలీసుల వైఫల్యమే అంటూ వైసీపీ నాయకులకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోలీస్ స్టేషన్ ముందు, అనంతరం సత్యమ్మ గుడి వద్ద పల్లె రఘునాథ రెడ్డితో పాటు నాయకులు బైఠాయించి నినాదాలు చేశారు. ఆ తరువాత రెండు వర్గాల వారు పార్టీ కార్యాలయాలకు చేరుకున్నారు. ప్రస్తుతం ఎప్పుడు ఏమి జరుగుతుందోనన్న భయాందోళన నడుమ పుట్టపర్తి నివురుగప్పిన నిప్పులా ఉంది.

విరమించుకోవాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

కాపాడవలసిన సీఎం జగన్ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన 4,000 ఎకరాల భూమి అమ్మకానికి బేరసారాలు ఆడటం దుర్మార్గమన్నారు. ఐఎఫ్‌టీయూ నాయకులు పోలారీ మాట్లాడుతూ కేంద్రం ప్రైవేటీకరణ విధానాలు వెనక్కి తీసుకోకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రఘురామరాజు, ఐఎఫ్‌టీయూ నాయకులు ఎం. రామకృష్ణ, ఏఐసీసీ నాయకులు ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రైవేటీకరణపై కేంద్రం దిగొచ్చేవరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. టీయూసీఐ నాయకులు ప్రసాద్ వందన సమర్పణ చేశారు. ఏఐటీయూసీ నగర అధ్యక్షులు కె.ఆర్.ఆంజనేయులు, నాయకులు వియ్యపు నాగేశ్వరరావు, శ్రీరామచంద్రమూర్తి, ఎన్.శ్రీనివాస్ రెడ్డి, కోరే కొండలరావు, బలగాని శ్రీను, బి.రాంబాబు, కంచర్ల నాగేశ్వరరావు, మనం సుబ్బయ్య, సీహెచ్‌వీ రమణ, ప్రభుదాస్, శీను, కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఎన్నేళ్లయినా ఉద్యమిస్తాం-జేఏసీ నేతల హెచ్చరిక

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణకు మొక్కవోని దీక్షతో ఎన్నేళ్లయినా పోరాటం కొనసాగిస్తామని జేఏసీ నేతలు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో విశాఖపట్నం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు 700 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా శనివారం శిబిరం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దగల గురజాడ విగ్రహం వరకు కార్మికులు, ఉద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఫ్లైఓవర్ కింద మానవహారం చేపట్టారు . ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్లు ఎం.జగ్గునాయుడు, జె అయోధ్య, వైస్ చైర్మన్లు పడాల రమణ, బి.నాగభూషణం అధ్యక్షతన సభ జరిగింది. ఈ సభలో ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు డి.ఆదినారాయణ, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నర్సింగరావు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి మంత్రి రాజశేఖర్, సీఎఫ్‌టీయూఐ జాతీయ అధ్యక్షులు ఎన్.కనకారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి వి.రామ్మోహన్‌కుమార్, హెచ్ఎంఎస్ జిల్లా కార్యదర్శి డి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.లోకనాథం, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు యూఎస్ఎన్ రాజు తదితరులు మాట్లాడారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ప్రజలు చేస్తున్న పోరాటం వృథా కాలేదని, రెండు సంవత్సరాలు పూర్తయినా మోదీ ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ అమ్మకంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయిందన్నారు. కొనేందుకు ఏ ప్రైవేటు సంస్థ ధైర్యం చేయలేక పోయిందన్నారు. ఇంతవరకు ఏ ఒక్కరూ స్టీల్‌ప్లాంట్‌లో అడుగు పెట్టలేకపోయారన్నారు. ఇది కార్మికులు, ప్రజలు చేసిన పోరాట ఫలితమే అన్నారు. మోదీ ప్రభుత్వ మెడలు వంచి స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిలిపివేసే వరకు మరింత ఉధృతంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీటీయూ నాయకులు జె. రామకృష్ణ, కె.శంకరరావు, వామన మూర్తి, వైఎస్ఆర్‌టియుసి నాయకులు చంద్రశేఖర్, ఇన్సూరెన్స్ యూనియన్ నాయకులు బి.వి.గణేష్, రైతుసంఘం నాయకులు జి.నాయినబాబు, పెన్షనర్స్ యూనియన్ కార్యదర్శి కె.సుధాకర్, తదితరులు ప్రసంగించారు.

గుంటూరులో: గుంటూరు నగరంలో వివిధ కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంఘాభావ ప్రదర్శన జరిగింది. ఏఐటీయూసీ నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, సీఐటీయూ నగర పశ్చిమ ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, జిల్లా కన్వీనర్ మేడా హనుమంతరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వీ కృష్ణ, నల్లమడ రైతు సంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహన్, ఎల్ఐసీ యూనియన్ నాయకులు వీవీకే సురేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే వలి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో: స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి యు. వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌బీడీ ప్రసాద్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఎ. అప్పలరాజు, కడుపు కన్నయ్య,పోలా భాస్కర్, బళ్ల కనకదుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల కార్యకర్తలు ఆర్టీసీ డిపో ఎదుట భారీధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్, ఏరియా కార్యదర్శి ఓసూరి వీర్రాజు, కళింగ లక్ష్మణరావు, పాలూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరంలో: రాజమహేంద్రవరం శ్యామల సెంటర్లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కేవీపీఎస్, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు, ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు టి.మధు, టి. అరుణ్, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాంబాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎం. సుందర బాబు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో: కాకినాడ జీజీహెచ్ ఎదురుగా పూలే విగ్రహం వద్ద కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, సీఐటీయూ అఖిలభారత ఉపాధ్యక్షులు బేబీ రాణి, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.యేసు, ఏఐటీయూసీ నాయకులు పీఎస్ నారాయణ, పెద్ది రెడ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒంగోలులో: విశాఖ ఉక్కు అమ్మకానికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అద్దంకి బస్టాండ్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు పీవీఆర్ చౌదరి, నగర కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు, ఏఐఎఫ్‌టీయూ న్యూ జిల్లా కార్యదర్శి ఎంఎస్ సాయి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్, మెడికల్ రిప్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ, సీఐటీయూల ఆధ్వర్యంలో కర్నూలు కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షులు వెంకటేశులు, సీఐటీయూ ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం.విజయ్ అధ్యక్షతన జరిగిన సభలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ, వృత్తి దారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి: డేగా ప్రభాకర్ పిలుపు

విశాలాంధ్ర - కొత్తపేట: భారత కమ్యూనిస్టుపార్టీ (సీపీఐ) ఆవిర్భవించి వంద సంవత్సరాలు దగ్గరపడు తోందని, అటువంటి పార్టీ లక్ష్యాలను జనాల్లోకి తీసుకువెళ్లి పార్టీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకరరావు పిలుపునిచ్చారు. శనివారం కొత్తపేటలోని సీపీఐ కార్యాలయం వద్ద నియోజకవర్గస్థాయి జనరల్ బాడీ సమావేశం కొత్తపేట మండల కార్యదర్శి మోకా హేమలత అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథి డేగ ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కమ్యూనిస్టు పార్టీ లక్ష్యాలను అందరికీ తెలియపరిచి పార్టీ బలోపేతానికి కృషిచేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఈ నెల 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం అధ్వర్యాన వాడ వాడల ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామనీ, ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ప్రభాకర్ కోరారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పాల్గొన్నారు.

పాలకుల నిరంకుశ వైఖరిపై ప్రచారోద్యమం

హరినాథరెడ్డి వెల్లడి

విశాలాంధ్ర -తిరుపతి: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార ఉద్యమాన్ని చేపడుతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి తెలిపారు. శనివారం ఉదయం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఉభయ పార్టీల నాయకులు మీడియాతో మాట్లాడారు. దేశ సంపదను అదానీ లాంటి కార్పొరేట్లకు కట్టబెడుతూ ప్రభుత్వ సంస్థలను నరేంద్ర మోదీ నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని రద్దుచేసి మన వాదాన్ని తెరపైకి తీసుకువచ్చే కుట్ర చేస్తున్నారని అన్నారు. ఈడీ, సీబీఐ సంస్థలను మోదీ తన గుప్పెట్లో పెట్టుకొని 300 అక్రమ కేసులు బనయించారని ఇందులో కేవలం 9 కేసులలో మాత్రమే శిక్ష పడిందని చెప్పారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నారని లొంగిపోతే వారిపై కేసులు కొట్టివేస్తు న్నారని చెప్పారు. నిత్యం దళితులపై దాడులు పెరిగి పోతున్నాయని, దాడులు చేసి సోషల్ మీడియాలో వీడియోలు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోలేదన్నారు. ఎన్నికల ముందు చెప్పిన వాగ్దానాలు ఒకటీ నెరవేర్చలేదనీ, నాలుగు సంవత్సరాలలో హంద్రీ నీవా, గాలేరి నగరి, సోమశిల స్వర్ణముఖి ప్రాజెక్టుల పనులు ఏమాత్రం జరగలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభు త్వాల వైఫల్యాలపై 14న సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామని హరినాథరెడ్డి తెలిపారు. సీపీఎం జిల్లా కార్య దర్శి నాగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కొల్లగొడు తోందనీ, రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని చెప్పారు. బీజేపీ అధికారం లోకి వచ్చాక నిత్యవసర ధరలతో పాటు గ్యాస్ డీజిల్ పెట్రోల్ ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. ఈ విలేకరుల సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జయలక్ష్మి, జిల్లా కార్యదర్శి మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, నదియా, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, జయ చంద్ర, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం

- రాహుల్‌పై అనర్హత వేటు అప్రజాస్వామికం
- రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): బీజేపీ పాలనలో దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని రాజ్యసభ మాజీ సభ్యులు కేవీపీ రామచంద్రరావు అన్నారు. శనివారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొని ఉద్వేగభరితంగా మాట్లాడుతూ ఉన్మాద మనస్తత్వం కలిగిన ఒక ప్రభుత్వాన్ని మనం ఎదుర్కొంటున్నామన్నారు. మన దేశ అప్పులు లక్షల కోట్లు పెరుగుతుంటే అదానీ ఆస్తులు మాత్రం భారీగా పెరుగుతున్నాయని తెలిపారు. అదానీని ప్రశ్నిస్తే దేశద్రోహం కింద పరిగణిస్తున్నారని, ఒక పెద్ద అవినీతిపరుడిని ప్రశ్నిస్తే దేశ ద్రోహం అవుతుందా అని కేవీపీ ప్రశ్నించారు. అదానీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీకి వాటా వెళుతోందని ఆరోపించారు. కేంద్రంలో ఉన్మాద ప్రభుత్వం నడుస్తోందని తద్వారా భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, కేవలం పెట్టుబడిదారులు, అవినీతిపరులను రక్షించేందుకు చూస్తున్నారన్నారు. దేశంలో వారు చేస్తున్న అవినీతిని ప్రశ్నించడానికి సిద్ధమైన రాహుల్‌ని వేధింపులకు గురి చేస్తూ, దేశద్రోహం నింద మోపడం సమంజసం కాదన్నారు. ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రసంగ పాఠాన్ని పార్లమెంటు స్పీచ్ నుంచి తొలగించడం అప్రజాస్వామిక చర్యగా ఆయన అభివర్ణించారు. పార్లమెంటు సభ్యుడిని అనర్హునిగా ప్రకటించాల్సింది రాష్ట్రపతి అని, అయితే అలా జరగకుండానే రాహుల్‌ని అనర్హుడిగా ప్రకటించారని విమర్శించారు. కోర్టు తీర్పు వచ్చిన వెంటనే కాపీ కూడా అందకుండా అనర్హత వేటు వేయడం వంటి చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారని, చరిత్రలో ఎప్పుడూ జరగలేదన్నారు. ఎంపీకి కేటాయించిన ఇల్లు కూడా ఖాళీ చేయాలని ఆదేశించడం చూస్తుంటే ఇది ఎంత అప్రజాస్వామిక చర్యో అవగతమవుతుందన్నారు.

ఏపీ నుంచి స్పందన లేకపోవడం సిగ్గుచేటు

రాహుల్‌పై అనర్హత వేటు వేస్తే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం సిగ్గుచేటని కేవీపీ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంపై ఇంత దారుణంగా దాడి జరుగుతున్నా ఏపీ నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. అందుకు అధికార వైసీపీకి కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, అందువల్లే బీజేపీని ప్రశ్నించలేకపోతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం దేశం ప్రమాదంలో ఉందని, దాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేంద్రంలో ఫాసిస్ట్ ప్రభుత్వం నడుస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసే అరాచకాలను ఏపీ మినహా బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలన్నీ ప్రశ్నిస్తున్నాయని చెప్పారు. కేవలం ప్రశ్నించడానికే వచ్చానంటూ ఏపీ రాజకీయాలపై ప్రశ్నించే జనసేన అధినేత పవన్ కళ్యాణ్... ఆయనకు బీజేపీతో ఉన్న సన్నిహిత సంబంధాల కారణంగా మాట్లాడకపోవడం గమనించదగ్గ పరిణామమే అన్నారు. ఇపుడు ప్రశ్నించకపోతే భవిష్యత్‌లో ఏమి మాట్లాడే అవకాశం ఉండదన్నారు.

చంద్రబాబు మౌనమేల!

కేంద్రంలో చక్రాలు తిప్పాను అని చెబుతూ ఎన్‌డీఏకి సారథ్యం వహించిన చంద్రబాబు నేడు రాహుల్ గాంధీకి జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడటం లేదని దెప్పిపొడిచారు. ఏపీలో జరిగే అన్ని అంశాలపై మాట్లాడే చంద్రబాబుకు చట్టాలపై గౌరవం ఉంటే కేంద్ర ప్రభుత్వ చర్యలపై నిలదీయాలన్నారు. కాంగ్రెస్‌తో టీడీపీ కలిసి పోటీ చేయడానికి తాను వ్యతిరేకించిన మాట వాస్తవమేనని ఒప్పుకున్నారు. అయితే నేడు రాహుల్‌గాంధీకి జరిగిన అన్యాయం విషయంలో కేంద్రాన్ని ప్రశ్నిస్తే టీడీపీతో కలిసి పని చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమానికి విజయవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నిమ్మరాజు చలపతిరావు అధ్యక్షత వహించగా, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు అంబటి ఆంజనేయులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్, ఉపాధ్యక్షులు కె.జయరాజ్, విజయవాడ అర్బన్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు, ప్రెస్ క్లబ్ కార్యదర్శి ఆర్.వసంత్ తదితరులు ఉన్నారు.

జగన్‌కు ఎందుకు దూరంగా ఉంటున్నానో త్వరలోనే చెబుతా: కేవీపీ

వైఎస్ రాజశేఖర రెడ్డికి అత్యంత సన్నిహితంగా ఉన్న కేవీపీ తన అల్లుడిగా భావించే ఏపీ ముఖ్యమంత్రి జగన్‌కు మాత్రం దూరంగా ఉంటున్నారు. తాజాగా ఆయన దీనిపై స్పందిస్తూ వైఎస్‌కు దగ్గరగా ఉన్న తాను జగన్‌కు దూరంగా ఎందుకు ఉంటున్నాననే విషయం గురించి త్వరలోనే చెబుతానని అన్నారు. ప్రస్తుతం దీనిపై మాట్లాడనని, కానీ ఎప్పటికైనా ఈ విషయం గురించి మాట్లాడాల్సిందేనని, మరో రోజు మీడియా ముఖంగా అన్ని విషయాలను వివరిస్తానని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

కార్పొరేట్‌కు దీటుగా ఎస్సీ గురుకులాలు

మంత్రి మేరుగు నాగార్జున వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలోని ఎస్సీ గురుకులాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా, శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ అభివృద్ధి చెందేలా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. మధురవాడ గురుకులానికి చెందిన విద్యార్థులు తమ వినూత్న ఆవిష్కరణతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించారని తెలిపారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీ, ఎంబీబీఎస్ సీట్లు కూడా సాధిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి విశాఖజిల్లాలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన మంత్రి మేరుగు నాగార్జునను శనివారం మధురవాడలోని డా.బీఆర్ అంబేద్కర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకులం విద్యార్థులు, టీచర్లు కలిసి తమ విద్యార్థులు సాధించిన ఘనతను వివరించారు. డాక్టర్ రోబోట్ అనే ఆవిష్కరణ ద్వారా ఆరుగురు విద్యార్థులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించిందని తెలిపారు. విద్యార్థులు తయారు చేసిన డాక్టర్ రోబోట్‌ను నాగార్జున పరిశీలించారు, దానిని తయారు చేసిన విద్యార్థులను అభినందించడంతో పాటుగా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్‌కు సంబంధించిన ధృవపత్రాలను అందించారు. అనంతరం మంత్రి దేవరాపల్లిలోని ఎస్సీ గురుకులాన్ని సందర్శించి అక్కడి విద్యార్థులతో ముచ్చటించారు. గురుకులంలోని అన్ని విభాగాలను పరిశీలించిన అనంతరం విద్యార్థులకు టెన్త్ హాల్ టిక్కెట్లను పంపిణీ చేశారు. నాగార్జున మాట్లాడుతూ, పదవ తరగతిలో రాష్ట్ర సగటు ఫలితాల కంటే ఎక్కువ ఫలితాలను గురుకులాల విద్యార్థులు సాధిస్తున్నారని తెలిపారు. ఏ కారణంతోనైనా పదవ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేకంగా ట్యూషన్లు పెట్టించి మళ్లీ పరీక్షలకు పంపిస్తున్న పద్ధతి కూడా మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. గురుకులం విద్యార్థులకు పదవ తరగతి తర్వాత ఉన్నత విద్యావకాశాలు మెరుగ్గా ఉండాలన్న లక్ష్యంతో ఐఐటీ, నీట్ కోచింగ్ సెంటర్లను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఉన్న ఈ కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్నారని తెలిపారు. గురుకులాల్లో చదువుకుంటున్న పిల్లలకు మంచి చదువుతో పాటుగా పౌష్టికాహారాన్ని కూడా ఇస్తున్నామన్నారు.

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న మోదీ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీఎస్ఎన్ మూర్తి

విశాలాంధ్ర - విశాఖ: కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, ప్రజావ్యతిరేక, మతతత్వ విధానాలతో పాలన సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రతిపక్షాలన్నీ ఏకం కావలసిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన సీపీఐ విశాఖ జిల్లా సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ హఠావో - భారత్ బచావో నినాదంతో నెలరోజుల ప్రచార ఉద్యమానికి సీపీఐ జాతీయ సమితి పిలుపునిచ్చిందని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు ఎవరికి వారుగా కాకుండా ఐక్యంగా పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రంలో తొమ్మిదేళ్లుగా పాలన సాగిస్తున్న బీజేపీ కార్పొరేట్లకు సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత అదానీ సంపద పెద్ద ఎత్తున పెరిగిందని చెప్పారు. ఒకపక్క దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతూ మరోపక్క పేదలపై భారాలు మోపుతోందని విమర్శించారు. తాజాగా టోల్‌గేట్ చార్జీలు పెరిగాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఖనిజ సంపదను కార్పొరేట్ వర్గాలకు కట్టబెట్టేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. నూతన విద్య విధానం వల్ల దళిత, గిరిజన, మైనారిటీ, బిసి విద్యార్థులు విద్యకు దూరమవుతారని అన్నారు. బీజేపీ విధానాలను వ్యతిరేకిస్తున్న వారిపై రాజ్యాంగ సంస్థలను ఉపయోగించి కేసులను పెడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీపై విధించిన అనర్హత వేటుపై అంతర్జాతీయంగా చర్చ జరుగుతోందని చెప్పారు. కుట్ర ద్వారా రాహుల్ గాంధీ పై అనర్హత వేటు వేశారన్నారు. దేశంలో నెలకొన్న పరిస్థితులపై బ్రిటన్‌లో రాహుల్ గాంధీ ప్రసంగంపై బిజెపి నేతలు అనవసరంగా రచ్చ చేస్తున్నారని విమర్శిం చారు. ప్రధానమంత్రి విద్యార్హత రహస్యమేమీ కాదని అన్నారు. రాష్ట్రంలో జగన్ గ్రాఫ్ క్రమంగా పడిపోతోందని చెప్పారు. ఈ సమావేశానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, మరో కార్యవర్గ సభ్యుడు పి చంద్రశేఖర్ సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు జిల్లాలో ఇటీవల నిర్వహించిన కార్యక్రమాల నివేదిక, భవిష్యత్ కార్యాచరణ వివరించారు.

బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలపై

ప్రచార యాత్రలు విజయవంతం చేయండి

ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపు

విశాలాంధ్ర -భీమవరం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలనపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14 నుంచి 30 వరకు చేపట్టిన ప్రచార యాత్రలు, ప్రచార సభలు విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం భీమవరం ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో జరిగిన సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా సమితి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సీహెచ్ రంగారావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందన్నారు. మతతత్వ దురంహకారంతో దళిత, మైనారిటీలపై దాడులు చేస్తూ మతసామరస్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నదన్నారు. రాష్ట్ర విభజన హామీలు అమలు చేయకుండా తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గిస్తే బ్యారేజి అవుతుందని జాతీయ బహుళార్థ సాధక ప్రాజెక్టు ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. విశాఖ రైల్వే జోన్ ఊసే ఎత్తడం లేదని పైపెచ్చు విశాఖ డివిజనులోని కీలక ప్రాంతాలను పక్క రాష్ట్రాలకు కలిపేసి చేతులు దులుపేసుకున్న బీజేపీని రాష్ట్ర ప్రజలు క్షమించరన్నారు. చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి తీసుకొచ్చి అమరావతే రాజధాని అని చెప్పిన మోదీ రాష్ట్రం నోట్లో మట్టికొట్టాడని, మోదీని ప్రజలు క్షమించరని ముప్పాళ్ల అన్నారు. పులివెందుల పులి దిల్లీలో పిల్లి అనీ, జగన్‌కు రాష్ట్ర ప్రయోజనాలకన్నా కుటుంబ ప్రయోజనాలే ముఖ్యమనీ, కేసులకు భయపడిన జగన్ కేంద్రానికి తొత్తుగా మారాడని విమర్శించారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి ప్రజాపోరును మనమే నడిపించాలని పార్టీ శ్రేణులు ఆ దిశగా సమాయత్తం కావాలని ముప్పాళ్ల దిశా నిర్దేశం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. మేనెలాఖరులో భీమవరంలో నిర్వహించ తలపెట్టిన ఏఐఎస్ఎఫ్ కోస్తాజిల్లాల శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నూలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి

ఆప్కో 38వ సర్వసభ్య సమావేశం తీర్మానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: నూలు, చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలని ఆప్కో డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం (ఆప్కో) 38వ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. శనివారం మంగళగిరిలోని రాయల్ కన్వెన్షన్‌లో ఈ సమావేశం జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి చేనేత సహకార సంఘల ప్రతినిధులు వందల సంఖ్యలో హాజరుకాగా, విభిన్న అంశాలపై లోతుగా చర్చించి తీర్మానాలను సమావేశం ఆమోదించింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి మానస పుత్రికగా అందిస్తున్న నేతన్న నేస్తం పథకం వేలాది చేనేతల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. కార్మికుల డిమాండ్ మేరకు రాయితీ నూలు సరఫరాకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి సంఘాలకు బకాయిలు లేకుండా చూసేందుకు నూతన విధానానికి అంకురార్పణ చేయనున్నామని చెప్పారు. పవర్‌లూమ్స్ పోటీని తట్టుకునేలా ఆధునికతకు అద్దంపడుతూ నూతన డిజైన్లను వినియోగదారులకు అందించాలన్నారు. ఆప్కో ఆస్తులు వేటినీ విక్రయించబోమని, లీజుకు ఇచ్చినవి చట్టపరిధికి లోబడి వెనక్కు తీసుకుంటామని తెలిపారు. చేనేత, జౌళి శాఖ కమిషనర్, ఆప్కో ఎండీ ఎంఎం నాయక్ మాట్లాడుతూ ఆప్కోలో పారదర్శకత కోసం నూతన సాఫ్ట్‌వేర్‌లతో కంప్యూటరీకరణను వేగవంతం చేస్తున్నామన్నారు. మార్కెట్ పోటీని తట్టుకుని వినియోగదారులకు ఎలా చేరువ కాగలమన్నదే మనకు సవాల్‌గా మారిందన్నారు. స్వల్ప మార్పులతో మరింత వైవిధ్యభరిత డిజైన్లను రూపొందించి మంచి మార్కెట్‌ను పొందగలమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు అప్పుపై వస్త్రాలిచ్చే పథకాన్ని పునరుద్ధరించేందుకు యత్నిస్తున్నామని చెప్పారు. నెలవారీ పొదుపు పథకం ద్వారా వస్త్రాలు కొనుగోలు చేసేలా మరో కార్యక్రమాన్ని తీసుకొచ్చేందుకు సమాలోచనలు జరుపుతున్నామని నాయక్ తెలిపారు. సమావేశంలో ఆప్కో డైరెక్టర్ అవ్వారి ఎల్లా సుబ్బారాయిడు, చేనేత, జౌళిశాఖ సంయుక్త సంచాలకులు మైసూరు నాగేశ్వర రావు, కన్నబాబు, ఆప్కో జనరల్ మేనేజర్ తనూజా రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇది మేనేజ్‌మెంట్ చేసిన హత్య

పేపరుమిల్లు కార్మికుడి ఆత్మహత్యపై ఓబులేసు

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: పేపర్‌మిల్లు కార్మికుడు సంగీత సత్యనారాయణ పరంపర 2లోని స్టోర్ రూమ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకొన్న ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు వెంటనే అక్కడకు చేరుకోగా వారిని లోపలికి మిల్లు యాజమాన్యం అనుమతించ లేదు. గేట్ వద్ద ఆపివేశారు. పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. ఓబులేసు మాట్లాడుతూ ఇది ఆత్మహత్య కాదు మేనేజిమెంట్ చేసిన హత్య అని విమర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కుటుంబంలో ఒకరికి ఉద్యగం ఇవ్వాలన్నారు. అక్కడ ఏఐటీయూసీ నాయకులు ఎంఎస్ రాజు, పాపెర్మిల్ నాయకులు జీఏ రామారావు, బద్రరావు రామకృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెచ్చిపోతున్న వైసీపీ రౌడీ మూకలు: అచ్చెన్నాయుడు ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్ రెడ్డి అండతో రాష్ట్రంలో వైసీపీ రౌడీ మూకలు పెట్రేగిపోతున్నాయని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పుట్టపర్తిలో టీడీపీ కార్యకర్తలపై దాడి చేసి, పల్లె రఘునాథ రెడ్డి కారును ధ్వంసం చేయటం దుర్మార్గపు చర్యగా పేర్కొన్నారు. ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తిని వైసీపీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అరాచకాలు, అక్రమాలకు నిలయంగా మార్చారు. పుట్టపర్తి నియోకవర్గంలో శ్రీధర్ రెడ్డి అక్రమ భూదందాలకు పాల్పడుతున్నారు. బిల్డర్లను బెదిరించి శ్రీధర్ రెడ్డి డబ్బులు వసూలు చేశారు. తోపుడు బండ్ల వ్యాపారం చేసుకునే వారి దగ్గర నుంచి కాంట్రాక్టర్ల వరకు అందరి దగ్గర శ్రీధర్ రెడ్డి కమీషన్లు వసూలు చేస్తున్నారు. శ్రీధర్ రెడ్డి అవినీతికి పాల్పడినందునే పల్లె రఘునాథ్ రెడ్డి విసిరిన సవాల్‌కి పారిపోయారన్నారు. ప్రమాణం చేయడానికి రాకుండా పిరికిపందలా పారిపోయిన శ్రీధర్ రెడ్డి, వైసీపీ గూండాల చేత టీడీపీ కార్యకర్తలపై దాడి చేయించటం సిగ్గుచేటన్నారు. వైసీపీ రౌడీ మూకలు పట్టపగలు పూటుగా మద్యం తాగి టీడీపీ కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు చేస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు? దాడి చేసిన వైసీపీ గూండాలను వదిలేసి టీడీపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జీ చేయటం దారుణమని, తక్షణమే టీడీపీ కార్యకర్తలపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు.

ఏపీకి ఏకైక రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ రాజధాని అమరావతి రైతులు 1200 రోజులుగా చేస్తున్న ఉద్యమానికి సంఘీభావంగా శుక్రవారం నిర్వహించిన మంగళగిరి టూ మందడం బైక్ ర్యాలీలో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ కోటేశ్వరరావు, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శులు లంక దుర్గారావు, నక్కా వీరభద్రరావు, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతీ వరప్రసాద్, సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, అధ్యక్షులు జాన్సన్‌బాబు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జమలయ్య, రైతు సంఘం గుంటూరు జిల్లా కార్యదర్శి పచ్చల శివాజీ, అమరావతి జేఏసీ కన్వీనర్ పీపీ మల్లికార్జునరావు, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

శేఖర్‌బాబు స్ఫూర్తితో నాయకులు పని చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు
- కార్మిక నేత శేఖర్‌బాబుకు నివాళి అర్పించిన ఏఐటీయూసీ నాయకులు

విశాలాంధ్ర-విజయవాడ: కార్మిక ఉద్యమ నేత కొరగంజి శేఖర్‌బాబు స్ఫూర్తితో కార్మిక నాయకులు పని చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. శేఖర్‌బాబు 18వ వర్ధంతి సందర్భంగా విజయవాడ నగరంలోని వివిధ డివి జన్‌లలో శనివారం కార్మిక సంఘాలు నిర్వహించిన కార్యక్రమాల్లో ఏఐటీయూసీ నాయకులు నివాళుల ర్పించారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. విజయవాడ వస్త్రలత వద్ద వస్త్రలత ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు చీపిళ్ల నత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఓబులేసు ముందుగా ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అణిచివేసే విధంగా మోదీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్ కొరగంజి శేఖర్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 14 నుంచి 30 వరకు నిర్వహించే 'మోదీ హఠావో.. దేశ్‌కీ బాచావో' ప్రచారాందోళనలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ఏఐటీయూసీ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు మాట్లాడుతూ శేఖర్‌బాబు నగరంలో అనేక కార్మిక సంఘాలను స్థాపించారని చెప్పారు. కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. మహిళా సమాఖ్య నాయకులు కొరగంజి దుర్గాంబ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కొట్టు రమ ణరావు, సీపీఐ నాయకులు సంగుల పేరయ్య, సింగరాజు సాంబశివ రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కోశాధికారి ఆర్.పిచ్చయ్య, ముఠా కార్మిక సంఘం నాయకులు పిళ్లా రాము, రామారావు తదితరులు పాల్గొ న్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజర య్యారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేశారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ

సాఫ్ట్‌బాల్ టోర్నీకి 'ఎస్కేయూ' జట్టు

విశాలాంధ్ర- రాప్తాడు: ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ సాఫ్ట్‌బాల్ టోర్నమెంటుకు ఎస్కేయూ అనుబంధ డిగ్రీ కళాశాల విద్యార్థుల జట్టు ఎంపిక అయింది. ఈనెల 5వ తేదీ నుంచి పంజాబ్ విశ్వవిద్యాలయంలో ఈ టోర్నీ జరగనున్నది. ఈ మేరకు క్రీడాబోర్డు కార్యదర్శి ఎంవీ శ్రీనివాసన్, జట్టు కోచ్ సి.వెంకటేసులు, మేనేజర్ నరేష్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు జెర్సీలను ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ రామకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. ఎంపికైన జట్టులో జి.మహేశ్, వరుణ్ కుమార్, అశోక్ కుమార్, శివకుమార్, లోకేశ్ లక్ష్మీకల్యాణ్, శ్రీనివాసులు ప్రసన్న కుమార్, వినోద్, యోగేశ్, నల్లన్న, సునీల్, భరత్, ధర్మేంద్ర, సురేంద్రబాబు ఉన్నారు.

సంపాదకీయం

కేజ్రీవాల్‌కు జరిమానా!?

ప్రజాతంత్ర వ్యవస్థలో కూడా ప్రశ్నించే అధికారం లేదని, అలా ప్రశ్నించిన వారికి కోర్టు శిక్ష విధిస్తుందని గుజరాత్ హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్హత ఏమిటి అని ప్రశ్నించినందుకు దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు 25,000 రూపాయల జరిమానా కూడా విధించింది. ప్రధానమంత్రి విద్యార్హత గురించి ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదని కూడా తేల్చేసింది. చదువుకోవడం, లేదా చదువుకోక పోవడం దోషమూ కాదు. నేరమూ కాదు. పైగా మన దేశంలో రాజకీయ నాయకులకు విద్యార్హత ఉండి తీరాలన్న నియమం ఏమీ లేదు. రాజకీయాలు విద్యకు సంబంధించిన అంశం కాదు. దేశాన్ని నడిపించే వారు అక్షరాస్యులు అయి ఉండడం ఈ రోజుల్లో అవసరం. ప్రధానమంత్రి నిరక్షరాస్యుడని ఎవరూ అనడంలేదు. కానీ ఆయన రాజనీతిశాస్త్రంలో ఎమ్మే పూర్తి చేశారని చెప్పడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. లేకపోతే సర్వాధికారాలు చెలాయించేస్థానంలో ఉన్న మోదీ మురికి కాలవనుంచి వెలువడే గ్యాస్‌తో చాయ్ తయారు చేయడానికి ఉపకరిస్తుందని అంటే నమ్మేయాలా!. మురికి కాలవలనుంచి వెలువడే గ్యాస్‌ను ఇంధనం కింద మార్చడం సాధ్యమని మోదీ చెప్పారు. అలాగే మేఘాల చాటున యుద్ధ విమానాలుఉంటే వాటిని రాడార్లు కనిపెట్టలేవు కనక మేఘాలమాటున శత్రువుల మీద దాడి చేయవచ్చునని కూడా ఆయన అన్నారు. ఇది మురికి కాలవల గురించి చెప్పిన మాటలకన్నా ఘోరమైంది. ఆయన కెనడావెళ్లి ఎ ప్లస్ బి హోల్ స్క్వేర్ అన్న బీజగణిత సూత్రాన్ని వివరించే ప్రయత్నంలో ఏం చెప్తున్నారో అర్థంకాని పరిస్థితి ఎదురైంది. శీతోష్ణస్థితిలో మార్పులు అనేవి ఏమీలేవని మరో సందర్భంలో అన్నారు. ప్రపంచమంతా శీతోష్ణస్థితిలో మార్పులను ఎదుర్కోవడానికి సతమతమవుతోంది. ఇంకో సందర్భంలో ఆయనే నేను పెద్దగా చదువుకోలేదు. మా ఊళ్లో ఉన్న బడికి మాత్రమే వెళ్లాను అన్నారు. అలాంటప్పుడు ఈ ఎమ్మే డిగ్రీ ఎక్కడి నుంచి వచ్చిందో! అక్షరాస్యత అంటే కేవలం అక్షరాలు రావడం కాదు. ఆ చదువువల్ల లోకజ్ఞానం పెరగాలి. కానీ మోదీ ఇలాంటి ప్రకటనలు చేయడం అయితే ఆయనకు లోకజ్ఞానం లేకపోయి అయినా అయిఉండాలి. లేదా అనునిత్యం ఆయనచేసే బూటకపు వాగ్దానాల్లాంటిదైనా అయి ఉండాలి. ఏమైనా మోదీ చెప్పినమాట పూర్తిగా అశాస్త్రీయమైంది. గత కొద్ది సంవత్సరాల కాలంలో అరవైవేల పాఠశాలలు మూసేయడం ప్రధానికి చదువు లేకపోవడమే కారణం అనుకోవాల్సి వస్తుంది. గుజరాత్ హైకోర్టు ఉత్తర్వు ప్రధానమంత్రి విద్యార్హత గురించి ఉన్న అనుమానాలను నివృత్తి చేయకపోగా వాటిని మరింత పెంచింది. ప్రధానమంత్రి ఎమ్మే చదివారని 2016లో అరుణ్ జైట్లీ, అమిత్ షా ఉమ్మడిగా విలేకరుల సమావేశం నిర్వహించి మోదీ డిగ్రీ ఇది అని చూపించారు. కానీ గుజరాత్ విశ్వవిద్యాలయం ఆయన డిగ్రీ గురించి ఎన్నిసార్లు అడిగినా మౌనముద్ర వీడడం లేదు. మోదీ డిగ్రీ చూపించకపోవడానికి రెండు కారణాలు ఉండొచ్చు. నా డిగ్రీల గురించి అడిగే హక్కు ఎవరికిఉంది అన్న అహంకారమో లేదా ఆ డిగ్రీ నకిలీది అయి ఉండడమో కావొచ్చు. ఆయన గుజరాత్ విశ్వవిద్యాలయం నుంచి కనక ఎమ్మే డిగ్రీ పుచ్చుకుని ఉన్నట్టయితే ఆ విషయం ఆ విశ్వవిద్యాలయానికి గర్వ కారణమే కదా! మా విశ్వవిద్యాలయంలో చదువుకున్న వ్యక్తి ప్రధానమంత్రి స్థాయికి ఎదిగారని గర్వించవచ్చుగా! మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ చదువుకున్న ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో ఆయన పేర ఒక పీఠమే ఉంది. మోదీ విద్యార్హతల వ్యవహారం కేంద్ర సమాచారశాఖ దాకా వెళ్లింది. అప్పుడు కేంద్ర సమాచార కమిషనర్‌గా ఉన్న మాడభూషి శ్రీధర్ ప్రధాని డిగ్రీని బయట పెట్టాలని గుజరాత్, దిల్లీ విశ్వవిద్యాలయాలను ఆదేశించారు. ఇప్పుడు గుజరాత్ విశ్వవిద్యాలయం ఈ ఆదేశాన్నే కొట్టేసింది.

మోదీ డిగ్రీ ఏమైనా రహస్య పత్రమా? అందులో దేశ భద్రతకు సంబంధించిన అంశం ఏమైనా ఉందా? కేజ్రీవాల్ ప్రశ్నించడంపై కేసు గుజరాత్‌లోనే నమోదు కావడంలో మతలబు ఏమైనా ఉందా? ఎవరైనా ఎన్నికలలో పోటీ చేసేటప్పుడు ఎన్నికల కమిషన్‌కు అందజేసే అఫిడవిట్‌లో తమ విద్యార్హతలను కూడా ప్రస్తావించవలసి ఉంటుంది. మోదీ పోటీ చేసేటప్పుడు తన విద్యార్హత గురించి ఆ అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాలకు గతంలోనూ, ఇప్పుడూ బయటపడుతున్న సమాచారానికి తేడా ఉందనుకోవాలా? గుజరాత్ హైకోర్టు వెలువరించిన 79 పేజీల తీర్పులో అనేక వైరుధ్యాలున్నాయి. మోదీ డిగ్రీ సామాజిక మాధ్యమాలలో ఉంది అని సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అంటున్నారు. మరి ఆ డిగ్రీ బయటపెట్టడానికి అభ్యంతరమేమిటో!. పైగా గుజరాత్ హైకోర్టు ప్రధాని డిగ్రీ గురించి ప్రశ్నించకూడదని ఆదేశించడం, కేజ్రీవాల్‌కు జరిమానా విధించడంలో ఆంతర్యం ఏమిటి? ప్రజా జీవనంలో ఉన్న వ్యక్తి డిగ్రీకి ప్రాధాన్యం ఉందని గుజరాత్ హైకోర్టు భావించనే లేదు. మోదీ బియ్యే డిగ్రీ గురించిన వ్యవహారం దిల్లి కోర్టులో ఇంకా విచారణలోనే ఉంది. ఎన్నికల కమిషన్ ఎదుట దాఖలుచేసే అఫిడవిట్‌లో ఇచ్చే సమాచారం తప్పయితే శిక్షకూడా పడొచ్చు. ఆ సమాచారం విద్యార్హతకు సంబంధించింది కూడా కావచ్చు. అందుకే గుజరాత్ హైకోర్టు ఈ అంశాన్ని లేవనెత్తడానికి వీలులేదని ఆంక్ష విధించిందా? ఈ కేసులో వాదించిన సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ప్రధానమంత్రి విద్యార్హతతో సంబంధం ఏమిటి, దీనివల్ల ప్రజాస్వామ్యానికి వచ్చిన ముప్పేమీ లేదనీ ప్రజాహితానికి సంబంధించిన అంశం కాదనీ అన్నారు. ప్రజాజీవనంలో ఉన్న వ్యక్తి గురించి సరైన సమాచారం తెలియడం ప్రజాహిత వ్యవహారమే అవుతుంది.

మోదీ డిగ్రీ గురించి అంత గోప్యత ఎందుకు అన్న అనుమానం సామాన్యమానవుల మదిలోకూడా మెదులుతుంది. కేజ్రీవాల్‌కు జరిమానా విధించడంద్వారా ఈ విషయాన్ని భవిష్యత్తులో ఎవరూ లేవనెత్తకూడదన్న సంకేతం కూడా ఉండొచ్చు. నిజానికి ఈ వ్యవహారంలో కేజ్రీవాల్ కక్షిదారు కాదు. ఆయన కేంద్ర సమాచార కమిషన్ ఎదుట మోదీ విద్యార్హతల ప్రస్తావన తీసుకొచ్చినప్పుడు ఆ కమిషన్ గుజరాత్ విశ్వవిద్యాలయాన్ని, దిల్లీ విశ్వవిద్యాలయాన్ని మోదీ డిగ్రీల గురించి సమాచారం ఇవ్వాలని ఆదేశించింది. ఈ తీర్పు చెప్పిన న్యాయమూర్తి నిజాయితీని ప్రశ్నించడానికి అవకాశం లేకపోవచ్చు. ఆయన చెప్పిన తీర్పుకు దురుద్దేశాలు అంటగట్ట కూడదు. కానీ తీర్పు మంచి చెడ్డలను చర్చించే అధికారం ఎవరికైనా ఉంటుంది. ప్రజాస్వామ్యాన్ని అడుగంటించే ప్రభుత్వ విధానాలను సమర్థించడానికే ఈ తీర్పు ఉపయోగపడుతుంది. ప్రశ్నించే హక్కు ప్రజాస్వామ్యానికి మూలం.

సామాజిక శాస్త్రాలను విస్మరించరాదు

ఐ.ప్రసాదరావు

ఈ రోజు మనం చూస్తున్న, నివసిస్తున్న ఈ నవ నాగరికత ప్రపంచం ఇలా ఉండటానికి కారణం అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలు. తద్వారా, నాగరికత రోజు,రోజుకు కొత్త పుంతలు తొక్కుతూ అనేక రంగాల్లో అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగుతోంది. ఒక సమాజం (లేదా) దేశం ఒక క్రమపద్ధతిలో అభివృద్ధి సాధించాలంటే సామాజిక శాస్త్రాలు, చరిత్ర, పౌరశాస్త్రం, రాజనీతి, ఆర్థిక, తత్వ,కళా,న్యాయ శాస్త్రాలు తప్పకుండా అధ్యయనంచేయాలి. చరిత్ర తెలుసుకోవడం ద్వారానే భవిష్యత్తును రూపుదిద్దుకోగలం. గతంలోజరిగిన మంచి, చెడు సంఘటనలు తెలుసుకోవడం ద్వారా వర్తమాన, భవిష్యత్తును తీర్చుదిద్దుకోగలరు.

ఇటీవల చాలామంది తల్లిదండ్రులు సామాజిక శాస్త్రాలు చదవడానికి తమ పిల్లలకు అవకాశం ఇవ్వడం లేదు. త్వరితగతిన చదువు పూర్తి చేసుకుని, లక్షల డబ్బులు ప్యాకేజీలు చేతికి వచ్చే చదువులకే ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రస్తుత సమాజంలో అనేక అసమానతలకు కారణం అవుతుంది. "చదువు అంటే కేవలం డబ్బు సంపాదించడమే" అనే ధోరణి అందరిలో ఎక్కువగా వ్యాప్తి చెందుతోంది. దీంతో "సమాజంలో అందరం బాగుండాలి-అందులో నేను ఉండాలి" అనే భావన మటుమాయం అవుతుంది. చివరికి తనను కన్న తల్లిదండ్రులను సైతం చివరి దశలో చూసే పరిస్థితి కనుపడుట లేదు. వృద్ధాశ్రమాలే శరణ్యం అవుతున్నాయి. ముక్కు పచ్చలారని మూడేళ్ల వయసులోనే కుటుంబ సభ్యులకు దూరంగా చదువు పేరుతో హాస్టల్లో చేర్పించడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయ అనురాగాలు దూరం అవుతున్నాయి. పెద్ద అయిన తరువాత కూడా తమ తల్లిదండ్రుల కోసం పరితపించే పరిస్థితి కనుపడుట లేదు. అంతా డబ్బు సంపాదించడం, ఆస్తులు కూడబెట్టడమే.... దీనికి అంతటికీ కారణం సామాజిక శాస్త్రాల్లో కనీస అవగాహన లేకపోవడం. తల్లిదండ్రులు ప్రేమకు దూరంగా ఉండటం....

ఒక దేశాధినేత సరిగా పాలించడంలేదు అంటే మనం సింపుల్‌గా హిట్లర్‌తో పోలుస్తాం. హిట్లర్ చరిత్ర అలా మారడానికి కారణం, ప్రపంచ యుద్ధాలకు కారణాలు, ఫలితాలు వంటివి పూర్తిగా అవగాహన చేసుకోవాలి అంటే చరిత్ర చదవాలి. ఈఫిల్ టవర్, తాజ్ మహల్ వంటివి నిర్మాణాలు, ప్రపంచ భౌగోళిక స్వరూపాలు, వివిధ దేశాల స్వాతంత్ర్య సమరాలు, వివిధ వాతావరణాలు, భాషలు, మతాలు, ఖగోళ విజ్ఞానం, పరిపాలన, మానవ హక్కులు, బాధ్యతలు, వివిధ అంతర్జాతీయ సంస్థలు, విధులు, విదేశాంగ విధానాలు, ఉగ్రవాదం, మతతత్వం, న్యాయ వ్యవస్థ, రాజ్యాంగాలు మానవ సంబంధాలు వంటివి తెలుసుకోవాలంటే సామాజిక శాస్త్రాలు అధ్యయనం చేయాలి. లేకపోతే భవిష్యత్తులో మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా, అబ్రహం లింకన్, అంబేద్కర్ వంటి వారు ఎవరు అని అడిగే పరిస్థితి ఏర్పడుతుంది...ఎంత బాధాకరం. పౌర సమాజమా ఆలోచన చేయాలి...? మానవ సంబంధాలను మట్టిలో కలిపేస్తున్నారు.

ప్రపంచాన్ని కుదిపివేసిన జాతి వివక్షత, నేటికీ మనదేశంలో కొనసాగుతోంది. కుల, మత, లింగ వివక్షత గూర్చి పూర్తి విషయాలపై అవగాహన కోసం, శరణార్థులు, వలసలు వంటి అంశాలపై నూతన పట్టుకొనం సామాజిక శాస్త్రాలు అధ్యయనం చేయాలి. మన దేశ స్వాతంత్ర్య పోరాటం, మనదేశంలో, రాష్ట్రాల్లో ప్రస్తుత పరిపాలన, ప్రభుత్వ విధానాలు, అధిక ధరలు, నిరుద్యోగం, పౌర హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, ప్రజా పోరాటాలు, నిరసనలు విశ్లేషణ చేయాలి. మనలాంటి ప్రజాస్వామ్య దేశంలో నిజాయితీగా ఓటు హక్కు వినియోగించుకోవడం వంటి విషయాలు తెలుసుకోవడం కోసం సామాజిక శాస్త్రాల అధ్యయనమే ప్రధానం..అప్పుడు మాత్రమే ప్రతీ ఒక్కరూ సమసమాజ నిర్మాణంలో భాగస్వామ్యం అవడానికి అవకాశం ఉంటుంది. లేనిఎడల అసమానతల సమాజంలో మానసిక అశాంతితో బ్రతికే పరిస్థితే...." మానవ సంబంధాలు అన్ని ఆర్థిక సంబంధాలే" అని కార్ల్‌మార్క్స్ ఎప్పుడో తెలిపారు. మరి ఈ సమాజంలో మానవులు అంతా ఫ్రెంచ్‌విప్లవం ఆశయాలు శాంతి, సమానత్వం, సౌభ్రాతృత్వంతో జీవించాలంటే సామాజిక శాస్త్రాలు తప్పకుండా అధ్యయనం చేయాలి. "టర్న్ ది పేజ్ - లెర్న్ ది లెసన్" అనే నానుడి ఉంది. అనగా గత చరిత్ర, సంఘటనలు తెలుసుకోవడం ద్వారానే భవిష్యత్తును రూపుదిద్దుకోగలం. మానవుడు జీవించడానికి డబ్బులు కావాలి. కానీ డబ్బే సమస్తం అని భావించడం అతి ప్రమాదకరం. డబ్బు, ఆధిపత్యం, అధికారం ఈ మూడే ప్రపంచానికి పెనుప్రమాదం అని గ్రహించాలి అంటే సమాజంపై అవగాహన అవసరం. ఇప్పటి వరకూ ప్రపంచంలో సంభవించిన అనేక సంఘటనలకు ఈ మూడు అంశాలే కారణం. అరిస్టాటిల్ చెప్పినట్లు "మానవుడు సంఘజీవి" అనే వాస్తవాన్ని అందరూ గ్రహించాలి. కుటుంబం, సమాజం, దేశ నిర్మాణానికి మానవులు అందరూ ఒక క్రమ పద్ధతిలో తమ వంతు పాత్ర పోషించాలంటే, సామాజిక శాస్త్రాలు చదవాలి. మానవ సంబంధాలు ద్వారా మహోన్నత సమాజాన్ని నిర్మించగలం అని అందరూ భావిద్దాం...

మోదీజీ అవినీతిని నిర్మూలించారా?

టి.వి.సుబ్బయ్య

బీజేపీ ఎంఎల్‌ఏ విరూపాక్షప్ప

అవినీతిని నిర్మూలిస్తానని వాగ్దానంచేసి ప్రధాని మోదీ అధికారానికి వచ్చారు. మరి అవినీతిని నిర్మూలించారా? అవినీతి పరులంతా ఒక్కటయ్యారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలనుద్దేశించి వ్యాఖ్యానించారు. కర్నాటకలో ఎన్నికల ప్రచారంలో భాగంగా కొన్ని ప్రాజెక్టులను ఆయన ప్రారంభిస్తూ మాట్లాడారు. కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం '40శాతం కమిషన్ ప్రభుత్వం' అని పేరుపడింది. ఆ రాష్ట్ర ప్రభుత్వ అవినీతిని భరించలేకుండా ఉన్నామని రాష్ట్ర కాంట్రాక్టర్ల సంఘం ప్రధానమంత్రికి నేరుగా లేఖరాసింది. దాని మీద ప్రధాని స్పందనేలేదు. గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప చేయించిన పనులకు బిల్లు పాస్ చేయడానికి కాంట్రాక్టు మొత్తంలో 40శాతం ముడుపులివ్వాలని వేధించడంతో కాంట్రాక్టరు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఆత్మహత్య చేసుకున్నది ఎవరో కాదు బీజేపీలో క్రియాశీలంగా తిరిగే ఒక మాదిరి నాయకుడు. ఇటీవల కర్నాటకలో మాదల్ విరూపాక్షప్ప అనే బీజేపీ ఎంఎల్‌ఏ కుమారుడు తండ్రి తరఫున రూ.40లక్షలు ముడుపు తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు ప్రత్యక్షంగా పట్టుకొని అరెస్టు చేశారు. ఆ తర్వాత పోలీసులకు దొరకకుండా విరూపాక్షప్ప ఐదారు రోజులు తప్పించుకొని తిరిగాడు. అరెస్టు చేసేలోపు ముందస్తు బెయిల్ తీసుకొని బైటపడ్డాడు. తప్పించుకు పోలేదని విరూపాక్షప్ప చెప్పాడు. అయితే పోలీసులు ఇంటికెళ్లి అరెస్టు చేయడానికి వెనక ఎవరున్నారోనని సందేహించవలసి వస్తుంది. అంతేకాదు తర్వాత జరిగిన దాడుల్లో తండ్రీ కొడుకుల వద్ద రూ.8కోట్లు నగదు దొరికింది.

కర్నాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన యడియూరప్ప, ఆయన కొడుకు ఇతర కుటుంబసభ్యులు తీవ్ర అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. యడియూరప్ప ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని రాష్ట్ర ప్రజలలో విస్తృత ప్రచారం జరిగాక తదుపరి ఎన్నికల్లో గెలవలేమని భావించిన మోదీ-అమిత్‌షాలు 2021లో ముఖ్యమంత్రిని మార్చి వేశారు. యడియూరప్పను తప్పించి బసవరాజ్ బొమ్మయ్‌ని ముఖ్యమంత్రి పీఠం ఎక్కించారు. ఒక్క ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా యోగి ఆదిత్యనాథ్ తప్ప తక్కిన బీజేపీ ముఖ్యమంత్రులంతా మోదీ-షాలు చెప్పినట్లు తలాడించవలసిన వారే. బొమ్మయ్‌పాలన వచ్చాక అవినీతి ఏమీ తగ్గలేదని చెప్పడానికి ఎంఎల్‌ఏ విరూపాక్ష ముడుపులు తీసుకున్న ఘటనకంటే మరే ఇతర రుజువులు కావాలి? ఈ అవినీతిని కప్పి పుచ్చేందుకు ఈ నాటికీ బీజేపీ ప్రయత్నిస్తోంది. ప్రధాని,హోంమంత్రి వీటి గురించి మాట్లాడారు. యడియూరప్పపైన 18 అవినీతి కేసులు పెండింగ్‌లో ఉన్నాయని సుప్రీంకోర్టు అమికస్ క్యూరీ సమర్పించిన నివేదికలో ఉన్నాయన్న విషయం విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ కేసుల్లో 14 యావజ్జీవ శిక్షకు అర్హమైనవిగా, 4కేసులు పదేళ్ల జైలుశిక్ష విధించదగినవని తేల్చింది. భారీగా లంచాలు చెల్లించాలని వత్తిడి చేస్తున్నారని 13వేల స్కూళ్లకు సంబంధించిన రెండు ఉపాధ్యాయ సంఘాలు ప్రధాని మోదీకి లేఖ రాసినప్పటికీ మౌనమే సమాధానమైంది. చివరకు మతపీఠాలకు కూడా లంచాల చెల్లింపు జాడ్యం తప్పలేదు. 30శాతం ముడుపులు మినహాయించుకొని మతాలకు నిధులు విడుదల చేస్తున్నారని ప్రముఖ లింగాయత్ మఠాధిపతి దింగలేస్వర్ స్వామి బహిరంగంగా ప్రకటించారు. పోలీసులు, ఎస్ఐల నియామకానికిసైతం భారీగా ముడుపులు తీసుకున్న కుంభకోణం వెలుగుచూసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, మోదీ-షాల నుంచి స్పందనలేదు. ప్రతిపక్ష నేతలపై ఒంటీ కాలిమీదలేచి వారి ఇళ్లపై దాడులుచేస్తున్న దర్యాప్తు సంస్థలు ఏనాడూ బీజేపీ నేతలు, మంత్రులు,ముఖ్యమంత్రుల జోలికి వెళ్లలేదు.

పార్లమెంట్‌లో, బీజేపీ సభ్యులలో ఎంతమంది అవినీతిపరులో మోదీ ప్రభుత్వానికి తెలియకుండా ఉండదు. కేంద్రమంత్రి షెకావత్ రాజస్థాన్‌లో సంజీవని కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీలో 900 కోట్ల నిధులు కాజేశారని వేసిన కేసు ప్రస్తుతం విచారణలోఉంది. అరెస్టును తప్పించుకొనేందుకు ముందుస్తు బెయిల్ తెచ్చుకున్నారు. అంతేకాదు. రాజస్థాన్ ముఖ్యమంత్రి గెహ్లాత్ తనను అప్రతిష్టపాలు చేశారంటూ ఆయన మీద దిల్లీ కోర్టులో పరువునష్టం కేసు వేశారు. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి చౌహాన్ వ్యాపం కుంభకోణం కేసులో ఇరుక్కున్న విషయం ఎవరికీ తెలియందికాదు. చివరకు ఇప్పుడు ప్రజలకు పంపిణీచేసే రేషన్ విషయంలో వందలకోట్లు అవినీతి జరుగుతోందని ఆ రాష్ట్ర అకౌంటెంట్‌జనరల్ నివేదిక బైటపెట్టిందది. ఇక 180దేశాల్లో అవినీతిపై సర్వే చేయగా మనదేశం 78వ స్థానంలోఉందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ నివేదిక వెల్లడించింది. బీజేపీ పాలనలోఉన్న ఉత్తరప్రదేశ్‌లో 78శాతం అవినీతి ఉందని వెల్లడించింది. కర్నాటకలో లంచాలివ్వకుండా పనులు చేయించుకునే వారు చాలా తక్కువ మంది ఉన్నారని అంచనా.. ఎన్నికల బాండ్ల ద్వారా వేలకోట్లు పొందుతున్న వ్యవహారం అధికారికమైందా? ఆశ్రిత పెట్టుబడీదారులు పన్నులు ఎగవేసి బాండ్లరూపంలో రాజకీయ పార్టీలకు ఇచ్చేది కాదా? ఈ అంశం సుప్రీంకోర్టు విచారణలో ఉంది. పెద్దనోట్ల రద్దువల్ల ఆశ్రిత పెట్టుబడిదారులు తమ వద్దగల నల్లధనాన్ని వైట్‌గా మార్చుకునేందుకు, ఉపయోగపడిందని ఎందుకు భావించరాదు? మోదీ పాలనలో అవినీతి పెరిగిందని తాజాగా అదానీ గ్రూపు కంపెనీలలో జరిగిన అక్రమాలు, అవినీతి వ్యవహారాలు తార్కాణం. అవినీతిలో కూరుకుపోయిన కర్నాటక వెళ్లి మాట్లాడితే హాస్యాస్పదంగా ఉంటుందికదా. ఓటర్లు ఇప్పుడు ఆలోచించవలసింది ప్రజాస్వామ్యం, రాజ్యాంగం స్వాతంత్ర్య పరిరక్షణ గురించే. అది ఓటర్ల చేతిలో ఉంది.

ఆకాశం హద్దుకాదన్న విశ్వ వైజ్ఞానికుడు

డాక్టర్ దేవరాజు మహారాజు

"అర్థమయేట్లు చెప్పాలంటే అసలు దేవుడు అనేవాడులేడు. ఈ విశ్వాన్ని ఎవరూ సృష్టించలేదు. నేను ప్రగాఢంగా విశ్వసించేదేమంటే, స్వర్గ నరకాలులేవు. మరణానంతర జీవితం కూడా లేదు. అద్భుతమైన ఈ విశ్వరహస్యాల్ని తెలుసుకోవాలంటే "మనకు ఉన్నది ఒక్క జీవితం మాత్రమే"-అని అంత బలంగా చెప్పిన డాక్టర్ స్టీఫెన్ హాకింగ్‌కు ఆ ఒక్క జీవితం కూడా ఎంతో దారుణంగా గడపాల్సి వచ్చిందని చాలా మందికి తెలిసుండక పోవచ్చు. ఆయన తన గురించి ఇలా చెప్పుకున్నారు. "నా శరీరం నిస్సత్తువగా కుర్చీలో కూలబడిపోవచ్చు. కానీ, నా మెదడు విశ్వాంతరాళాల్ని శోధిస్తుంది" అని, ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పుకున్న భౌతిక శాస్త్రవేత్త హాకింగ్.

1942 జనవరి 8న ఇంగ్లండులోని ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించిన హాకింగ్ 30ఏళ్లు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసి, పదవీ విరమణ చేశారు. హాకింగ్ తల్లి ఇసబెల్ హాకింగ్ బ్రిటీష్ కమ్యూనిస్టుపార్టీ సభ్యురాలు. అందువల్ల స్టీఫెన్ చిన్నప్పటినుండి ప్రగతిశీల భావాలుగల అబ్బాయి. తండ్రి ఫ్రాంక్ మెడికల్ డాక్టరు. పరిశోధకుడు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ రీసెర్చిలో పారసైటాలజీ విభాగానికి అధిపతి. ఆయన తరచూ ఆఫ్రికావెళ్లి అక్కడ పరిశోధనల్లో నిమగ్నమవుతూ ఉండేవారు. అందుకే స్టీఫెన్ తల్లితోనే ఎక్కువగా కాలం గడిపాడు. ఆమె ఉన్నత విద్య నభ్యసించిన మహిళ. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో రాజకీయ, ఆర్థిక, తాత్విక శాస్త్రాలు అభ్యసించి, సామాజిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటూఉండేది. స్టీఫెన్‌కి ఫిలిప్పా, మేరి అనే ఇద్దరు చెల్లాయిలతో పాటు, తన తల్లిదండ్రులు దత్తత తీసుకున్న సోదరుడు ఎడ్వర్డు ఉండేవాడు. తన పదమూడోవ ఏట హాకింగ్, బెర్ట్రాండ్ రస్సెల్‌ను ఆదర్శంగా తీసుకున్నాడు. విద్యార్థిదశలో పరిచయమైన జేన్ వైల్డ్ అనే అమ్మాయితో ప్రేమలోపడి పెళ్లి చేసుకున్నాడు. అప్పటికే అతనికి మోటార్ న్యూరోసిస్ వ్యాధి సోకింది. నేచురల్ సైన్సెస్‌లో బి.ఎ(ఆనర్స్) డిగ్రీ ప్రథమశ్రేణి సాధించాడు.

ఫైనల్ ఇయర్‌లో ఉండగా స్టీఫెన్ కళ్లుతిరిగి మెట్లమీద పడిపోయాడు. మూతి వంకర పోసాగింది. క్రిస్మస్ సెలవుల్లో ఇంటికి వెళ్లినపుడు కుటుంబసభ్యులు ఆయన పరిస్థితి గమనించి వైద్యం చేయించడం ప్రారంభించారు. అప్పుడది ఆయనకు ఎ.ఎల్.యస్ అని తేలింది. అంటే ఏమియోట్రాఫిక్ లేటరల్ స్క్లిరోసిస్ అనే వ్యాధి. దానినే గెహరిగ్స్ వ్యాధి అనికూడా అంటారు. ఇది ఒక మోటార్ న్యూరాన్ వ్యాధి. 1963లో బైటపడినప్పుడు ఆయన కేవలం రెండు సంవత్సరాలు మాత్రమే బతకగలడని డాక్టర్లు చెప్పారు. అంటే ఆయన తన 23వ ఏట చనిపోవాల్సింది. కానీ ఇప్పుడాయన వయసు 76. బ్లాక్‌హోల్స్‌పై పరిశీలనలు చేస్తున్న సమయంలోనే 1965లో గాన్‌విల్లి కైస్ కాలేజి వారి ఫెలోషిప్ దొరికింది. దాంతో అప్లయిడ్ మాథమెటిక్స్ థియరటికల్ ఫిజిక్స్-కాస్మోలజీలో పీ.హెచ్.డీ తీసుకున్న స్టీఫెన్, మొదట్లో క్లచస్ ఉపయోగిస్తూ మెల్లగా నడిచేవారు. పనిచేసే యూనివర్సిటీ డిపార్టుమెంట్‌కు దగ్గర్లో ఇల్లు దొరకడం చాలా కష్టంగా ఉండేది. మరోవైపు భార్య జేన్ వైల్డ్ కూడా పీహెచ్.డి ప్రోగ్రాంలో చేరింది. మరోవైపు పిల్లల సంరక్షణ, కొడుకు రాబర్ట్(1967) కూతురు లూసీ(1970) మరో బిడ్డ టిమోతి(1979) పుట్టారు. హాకింగ్ తన శారీరకలోపాల గురించి ఎవరితోనూ ఎక్కువగా చర్చించేవారు కాదు. విధిరాత, దైవం వంటి వాటిని నమ్మేవారు కాదు కాబట్టి వాస్తవ పరిస్థితి ఎదుర్కోవడానికే సిద్ధపడేవారు. తన అంగవైకల్యానికి సానుభూతి ప్రకటిస్తూ సహాయపడడానికి వచ్చేవారిని వారించేవారు. ఆయన తనను మొదట సైంటిస్ట్‌గా గుర్తించాలనుకునేవారు. తరవాత పాపులర్ సైన్స్ రచయితగా ఆ తరువాత కొన్ని ఆలోచనలతో, భావాలతో, ఆశలతో, కోర్కెలతో ఉన్న ఒక మామూలు మనిషిగా గుర్తించాలని కోరుకునేవారు. ఆయనది గొప్ప ధ్యేయమని కొందరంటే 'పిచ్చి పట్టుదల' అని మరికొందరనేవారు. ఈ రెండు అభిప్రాయలూ విన్న ఆయన భార్య జేన్‌హాకింగ్, రెండింటినీ ఒప్పుకునేది. "ఆ రెండూ కలిసికట్టుగా పనిచేస్తున్నాయేమో"నని అనేది. లేదా "ఒకటి తర్వాత ఒకటి -పనిచేస్తున్నాయేమో" నని అనేది.

వెర్నర్ ఇస్రాయిల్ అనే భౌతిక శాస్త్రవేత్త మోజర్ 'కంపోజింగ్ సింఫనీ' తెచ్చి స్టీఫెన్ తలకు అమర్చాడు. దానివల్ల ఆయనకు తననుతాను వ్యక్తీకరించు కునే అవకాశం కలిగింది. దాన్ని అభ్యసించడానికి ఆయనకు కొంత సమయంపట్టినా, తర్వాత కాలంలో అది ఎంతో ఉపయోగపడుతూ వచ్చింది. 1970 నాటికి మాట పూర్తిగా పడిపోయింది. అతని హావభావాలు కుటుంబసభ్యులకు, అతి సన్నిహితులకు మాత్రమే అర్థమయ్యేవి. 1985లో ఫ్రాన్స్, స్విట్జర్లాండ్‌ల సరిహద్దులమీద సెర్న్‌ను సందర్శించినపుడు ఆయనకు న్యుమోనియా పట్టుకుంది. తీవ్ర అస్వస్థత ఎదుర్కోవలసి వచ్చింది. 'లైఫ్ సపోర్ట్' తీసెయ్యొచ్చా-అని కూడా ఆయన భార్య జేన్ హాకింగ్‌ను అడిగారు. ఆమె అందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా ట్రాఖియోటొమి వచ్చింది. దానితో ఇరవైనాలుగు గంటలు వైద్య పర్యవేక్షణలో ఉండాల్సివచ్చింది. నర్సింగ్ హోమ్ ఖర్చు తాము భరిస్తామని నేషనల్ హెల్త్ సర్వీస్ ముందుకొచ్చి ఆయనకు అండగా నిలిచింది. కాని, ఆయన భార్య ఒప్పుకోలేదు. ఆయన ఇంటి దగ్గరే ఉండాలని కోరుకుంది. ఆ దశలో అమెరికన్ ఫౌండేషన్ ముందుకొచ్చి ఖర్చు భరించింది. మూడు షిఫ్టులలో నర్సుల్ని ఏర్పాటుచేసి పర్యవేక్షించారు. అలా నియమించినవారిలో ఎలెన్ మాసన్ అనే నర్సుకూడా ఉంది. ఈమె భర్త డేవిడ్ ఒక కంప్యూటర్ ఇంజినీర్. ఆయన ఒక చిన్న కంప్యూటర్‌ని స్టీఫెన్ హాకింగ్ వీల్ చైర్‌కు అమర్చాడు. అందులోని సింథసైజర్ విషయాన్ని మాటగామార్చి ఎదుటివారికి వినిపిస్తుంది. అందుకోసం తన గొంతునే వాడమన్నాడు స్టీఫెన్. మాటపడిపోకముందున్న తన గొంతు ధ్వనిని అందులో ఉపయోగించమన్నాడు. దానివల్ల స్టీఫెన్ హాకింగ్ సాంకేతిక సంభాషణ సహజ సంభాషణలా మారిపోయేది.

స్పెల్లింగ్ కార్డ్ మీద అక్షరాల్ని ఎన్నిక చేసుకోవడానికి తొలుత ఆయన కనుబొమలు కదిలించేవారు. తర్వాత 1986లో 'ఈక్వలైజర్' అనే కంప్యూటర్ ప్రోగ్రాం అందుబాటులోకి వచ్చింది. వర్డ్స్ ప్లస్ సీఈఓ అయిన వాల్టర్ వోల్టాస్ తను రూపొందించిన సాఫ్ట్‌వేర్ తెచ్చి అమర్చాడు. దానివల్ల 2500-3000 వరకు అక్షరాలు, పదాలు, వాడుక మాటలు అన్నీ ఒక చిన్నమీట నొక్కితే అందుబాటులోకి వచ్చేవిధంగా ఉంటాయి. నిమిషానికి పదిహేను పదాలు టైపు చేయగల సామర్థ్యం ఆ సాఫ్ట్‌వేర్‌కి ఉండడం వల్ల, ఆయన ఉపన్యాసాలు, వ్యాసాలు, రచనలు అన్నీ తయారవుతూ ఉండేవి. ఉపన్యసించాల్సిన చోట ఆ విషయాల్ని ముందుగానే స్పీచ్ సింథసైజర్‌కు పంపి సిద్ధంగా ఉంచుకోవడం వల్ల అక్కడ ఆయనే స్వయంగా మాట్లాడుతున్నట్లు ఉండేది. స్టీఫెన్ హాకింగ్ కేవలం మనిషి ఆత్మవిశ్వాసాన్ని నమ్మిన శాస్త్రవేత్త. మేధావి. ఆయనను కాపాడుకోవడానికి కుటుంబమేకాదు సమాజమే కదిలివచ్చింది. మనిషికోసం మనుషులు కదిలివచ్చినట్లయింది. అంతటి దయనీయమైన స్థితిలో కూడా ఆయన దేవుడ్ని తలవలేదు. ముడుపులు కట్టలేదు. క్రీస్తు భజనలు చేయలేదు. పైగా జరుగుతున్న వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనల్లో దేవుడి ప్రమేయమే లేదని అన్నారు. మనిషి చేస్తున్న అవిష్కరణలు, సాధిస్తున్న విజయాలులేని దేవుడి ఖాతాలోవేస్తూ బతికే పలాయన వాదులున్నంతకాలం మార్పురాదు. ఈ విషయం చెప్పడానికే స్టీఫెన్‌హాకింగ్ శారీరక బలహీనతగూర్చి, ఆయన అచంచల ఆత్మవిశ్వాసం గూర్చి ఇక్కడ వివరించడం జరుగుతోంది. 2005లో ఆయనతన పరికరం వాడడానికి చెంప కండరాలు కదిలించేవాడు. నిమిషానికి అది ఒక పదం మాత్రమే తీసుకునేది. అది ఇబ్బందిగా అనిపించడంవల్ల, ఇన్‌టెల్ పరిశోధకుల సహకారంతో మరోవిధానం అందుబాటులోకి వచ్చింది. అది అతని మెదడులోని విషయాల్ని, ముఖ కవళికల్ని అనువదించి చెప్పేది. అది కూడా అంత ఉపయోగకరంగా లేకపోవడం వల్ల లండన్‌లోని షిఫ్ట్‌కి కంపెనీ ముందుకొచ్చింది. అంతకుముందు స్టీఫెన్ హాకింగ్ రాసిన పరిశోధనా పత్రాల్లోని పదాల్ని, వాక్యాల్ని, విషయాల్ని తరచుగా వాడే వాడుక మాటల్ని అది గుర్తుపెట్టుకుని టైప్ చేసేది. ఈ పద్ధతి మనం రోజూ వాడే స్మార్ట్‌ఫోన్‌లలో కూడా చూస్తున్నాం. మనం టెక్స్ట్ టైప్ చేసేప్పుడు తరచుగావాడే పదాల్ని అదిగుర్తు చేస్తుంటుంది.

2009 నాటికి ఆయన వీల్‌చైర్‌ని నడుపుకోలేని స్థితి వచ్చింది. తర్వాత మెడ, గడుమ భాగాలు కదిలిస్తే దాన్ని అనుసరించి కుర్చీ కదిలేవిధంగా ఏర్పాటు చేశారు. అయితే అది ఆయనకు పనిచేయలేదు. అలా చేయడంవల్ల ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులొచ్చాయి. మళ్లీ ఆసుపత్రిలో కూడా చేరాల్సివచ్చింది. అలాంటి స్థితిలో కూడా ఆయన మానవజాతి గురించే ఆలోచించారు. "రాజకీయంగా, సామాజికంగా, పర్యావరణ పరంగా ధ్వంసమవుతున్న ఈ సమాజంలో మానవజాతి మరో వందేళ్లు కొనసాగే దెట్లా?" అని బెంగపెట్టుకున్నారు. యవ్వన దశలోనే వైద్యపరమైన శారీరక సమస్యలకు గురైన స్టీఫెన్‌హాకింగ్, జీవితంలో నిశ్శబ్దంగా అనేక పోరాటాలు చేస్తూవచ్చారు. నిస్సత్తువగా మారిన తన శరీరంతో తాను పోరాడుతూ, జ్ఞానకాంక్షకోసం పోరాడుతూ, ప్రపంచ మానవాళి మూఢత్వంతో పోరాడుతూ, 76ఏళ్ల వయసులో కూడా అచంచల ఆత్మవిశ్వాసంతో ఒక జ్ఞానశిఖరంగా నిలబడడం ఆయన ప్రత్యేకత. దెబ్బతాకితేనో, జ్వరం వస్తేనో దేవుడికి ముడుపులు కట్టి మొక్కుకునే మూఢజనం హాకింగ్ జీవితం గూర్చి ఏమైనా నేర్చుకోగలరా? మంచి కుటుంబ నేపథ్యం, మంచి ఆర్థికస్తోమత, మంచి ఆరోగ్యంతో మంచి జీవితం అనుభవిస్తూ కూడా, పక్కవాడికి కాదుగదా తమకు తామే పనికిరాని వాళ్లు ప్రపంచంలో కోకొల్లలుగా ఉన్నారు. వారితో పోలిస్తే హాకింగ్ జీవితం ఎంతోఉన్నతమైంది. అర్థవంతమైంది కూడా! చేతులు లేక కాలితో సంతకంచేసే వారిని చూస్తేనో, కాళ్లు లేక చేతుల మీద నడిచే వారిని చూస్తేనో జనం జాలిగాచూస్తారు. వారి గుండెధైర్యాన్ని మెచ్చు కుంటారు. మరి స్టీఫెన్ హాకింగ్ పరిస్థితి ఏమిటి? మెడ ఒక్కటితప్ప మిగతా శరీరమంతా కుప్పగూలి ఉన్నారు కదా? అయినా, ఆయన ధ్యేయాన్ని క్షణకాలమైనా మరువలేదుకదా? విశ్వవిజ్ఞానానికి తన వంతుగా కొత్త విషయాలందిస్తూ వచ్చారుకదా?

మృత్యువు అంచుమీద శ్వాసిస్తూ కూడా, మనిషి విజయ పరంపర గూర్చి మాత్రమే ఆలోచించారు డా.స్టీఫెన్ హాకింగ్. ఒక రకంగా చెప్పాలంటే ఆరోగ్యంగా కనిపిస్తున్న దుర్బలులైన మిలియన్ల ప్రజలకంటే కూడా హాకింగ్ దృఢ సంకల్పుడు. మానసిక బలశాలి. ఆయనకు ఆకాశమే హద్దు-అనుకోలేదు. ఆ ఆకాశాన్ని ఇంకొంచెం పైకి ఎదగమని..విసరకనే సవాల్ విసిరారు. 2018 మార్చి14 బుధవారం తెల్లవారుజామున విశ్వాంతరాళంలోకి వెళ్లిపోయిన స్టీఫెన్ హాకింగ్‌కు ప్రపంచ మానవాళి నివాళులర్పించింది.

-వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, సైన్స్ ప్రొఫెసర్

సంజయ్ రౌత్‌కు బెదిరింపు

ముంబై : గత ఏడాది కాల్చి చంపబడిన పంజాబీ గాయకుడు సిద్ధూ మూస్‌వాలా వలె తనను కూడా చంపేస్తానని బెదిరిస్తూ శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌కు సందేశం పంపిన ఆరోపణలపై పూణేకు చెందిన 23 ఏళ్ల యువకుడిని ముంబై పోలీసులు అరెస్టు చేసినట్లు పోలీసు అధికారి శనివారం తెలిపారు. నిందితుడు రాహుల్ తలేకర్‌కు ఎలాంటి నేర నేపథ్యం లేదని, అతను మద్యం తాగి ఉన్నప్పుడు సందేశం పంపినట్లు పేర్కొన్నట్లు అధికారి వివరించారు. ప్రాథమిక దర్యాప్తును ఉటంకిస్తూ, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర అంతకుముందు మాట్లాడుతూ ఫడ్నవీస్ మద్యం మత్తులో బెదిరింపులకు పాల్పడ్డాడని, అయితే, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రౌత్ సోదరుడు, ఎమ్మెల్యే సునీల్ రౌత్ ఇక్కడి కంజుర్‌మార్గ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కొన్ని గంటల తర్వాత ముంబై, పూణే పోలీసుల ఆపరేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఖరాడి ప్రాంతం నుంచి తలేకర్‌ను పట్టుకున్నారని అధికారి తెలిపారు. రౌత్‌ను 'హిందూ వ్యతిరేకి' గా పేర్కొంటూ, 'దిల్లీ మే మిల్ తు ఎకె 47 సే ఉదా దుంగా' అని సందేశం ఉంది. ఇందులో 'లారెన్స్' గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ను సూచిస్తుందని పోలీసులు అనుమానిస్తున్నారు. జాల్నాకు చెందిన తాలేకర్ పూణేలో తినుబండారాల దుకాణం నడుపుతున్నాడు. ఎంపీని ఫోన్‌లో సంప్రదించడంలో విఫలమవడంతో అతను శుక్రవారం వాట్సాప్‌లో రౌత్‌కు ఈ బెదిరింపు సందేశాన్ని పంపాడని అధికారి తెలిపారు. బిష్ణోయ్ గ్యాంగ్‌లోని ముగ్గురు సభ్యులు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్, అతని తండ్రి సలీం ఖాన్‌ను బెదిరిస్తూ లేఖ పంపారని పోలీసులు తెలిపారు. తలేకర్‌పై 506-2 (క్రిమినల్ బెదిరింపు) సహా ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నగర పోలీసులు ఇప్పటికే సల్మాన్ ఖాన్ బెదిరింపు కేసును విచారిస్తున్నారని, దీనికి సంబంధించి కూడా ఈ వ్యక్తిని ప్రశ్నిస్తారని అధికారి తెలిపారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) ఎంపీ సుప్రియా సూలే మాట్లాడుతూ రౌత్ శాసనసభ్యుడు, అతనికి అలాంటి ముప్పు తీవ్రమైన సమస్య అని, కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వం దీనిని గుర్తించాలని అన్నారు.

రేపు ఏఐఎఫ్‌సీ 'పార్లమెంట్ మార్చ్'

రాహుల్‌కు సంఘీభావం

మోదీ ప్రభుత్వ చర్యలకు నిరసన

న్యూదిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి తమ సంఘీభావాన్ని ప్రకటిస్తూ పార్లమెంట్ మార్చ్‌కు అఖిలభారత మత్స్యకారుల కాంగ్రెస్ (ఏఐఎఫ్‌సీ) పిలుపునిచ్చింది. ఇందులో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు దిల్లీ, జంతర్‌మంతర్ వద్ద పార్లమెంట్ మార్చ్‌ను ఖర్గే ప్రారంభిస్తారు. దేశంలోని మత్స్యకారుల సమస్యలనూ పార్టీశాఖ లేవనెత్తనున్నదని ఏఐఎఫ్ఎస్ చైర్మన్ ఎస్ ఆర్మ్‌స్ట్రాంగ్ ఫెర్నాడో వెల్లడించారు. కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, కె.రాజు, టీఎన్ ప్రతాపన్, పార్టీకి చెందిన ఇతర ఎంపీలు కూడా నిరసన ప్రదర్శనలో పాంటారన్నారు. 'దేశ మత్స్యకారుల బలప్రదర్శనకు ఈ మార్చ్ దోహదమవుతుంది. రాహుల్ గాంధీపై మోదీ ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై ఆగ్రహాన్ని ప్రతిబింబిస్తుంది' అని అధికారిక ప్రకటన పేర్కొంది. మత్స్యకారుల హక్కుల కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారని, ఆయనను అణచివేసే ప్రయత్నాలతో మత్స్యకారులపైనే కాకుండా పేదవర్గాలపైనా ప్రభావం పడుతోందని తెలిపింది. మోదీ ఇంటి పేరును అవమానించారంటూ గుజరాత్‌లోని సూరత్ కోర్టు రాహుల్‌కు శిక్ష విధించడంతో ఆయనపై ఈనెల 23న లోక్‌సభలో అనర్హత వేటు పడింది.

విమానంలో ప్రయాణికుడి అసభ్య ప్రవర్తన

ముంబై: గగనతలంలో ఒక ప్రయాణికుడు విచక్షణ కోల్పోయాడు. ఎయిర్ హోస్టెస్‌తో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు తోటి ప్రయాణికులపై దాడికిపాల్పడ్డాడు. బ్యాంకాక్ నుంచి ముంబైకి వస్తున్న ఇండిగో విమానంలో ఈ ఘటన చోటుచేసుకుంది. విమానంలో ఆహారం అందుబాటులో లేదని ఎయిర్‌హోస్టెస్ చెప్పగా సదరు ప్రయాణికుడు అనుచితంగా ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఆ తర్వాత చికెన్ డిష్ తీసుకోవడానికి అంగీకరించాడు. పేమెంట్ కోసం ఆయన వద్దకు ఆమె పీఓఎస్ మెషిన్ తీసుకెళ్లారు. కార్డు స్వైపింగ్ వంకతో ఆమెను అసభ్యంగా తాకాడు. దానిపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా ఆ వ్యక్తి సీటు నుంచి లేచి, అందరి ముందు వేధించాడు. ఈ మేరకు ఆమె ముంబయి పోలీసులకు వెల్లడించింది. అతడు అక్కడితో ఆగకుండా ఇతర సిబ్బందిని, తోటి ప్రయాణికులను ఇబ్బందిపెట్టాడని ఫిర్యాదు చేశారు. విమానం ముంబయికి చేరుకోగానే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతడు స్వీడన్ జాతీయుడైన 62 ఏళ్ల క్లాస్ ఎరిక్ ఎరాల్డ్ జొనాస్ వెస్ట్‌బర్గ్ అని పోలీసులు తెలిపారు. తర్వాత కోర్టు ముందు ప్రవేశపెట్టారు. కోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. ఈ మధ్యకాలంలో విమానాల్లో ప్రయాణికులు అనుచితంగా ప్రవర్తిస్తోన్న ఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. కొద్దిరోజుల క్రితం ఎయిరిండియా విమానంలో మూత్ర విసర్జన ఘటన తీవ్ర వివాదాస్పదమైంది. ఇక ఇటీవల గువాహటి నుంచి దిల్లీ వెళుతున్న విమానంలో ఓ వ్యక్తి తప్పతాగి తన సీటు పక్కనే వాంతులు చేసుకున్నాడు. టాయిలెట్ వద్ద మలవిసర్జన చేశాడు. దీంతో విమానంలోని సిబ్బంది, తోటి ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. దీనికి సంబంధించిన ఫొటోను అదే విమానంలో ప్రయాణిస్తున్న ఓ న్యాయవాది ట్విటర్‌లో పోస్టు చేసి ఆవేదన వ్యక్తం చేయడంతో విషయం వెలుగుచూసింది.

పదేళ్ల బాలుడి సాహసం

పనాజీ: తన ప్రాణాలను పణంగా పెట్టి నీటిలో మునుగుతున్న మిత్రులను కాపాడిన పదేళ్ల బాలుడి ధైర్యసాహసాలకు ప్రశంసల జల్లు కురుస్తోంది. రాష్ట్ర రాజధాని పనాజీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుంబార్జువాలో గ్రామ దేవత ఉత్సవాలు జరుగుతున్న సందర్భంగా నలుగురు స్నేహితులు అక్కడికి వెళ్లారు. రంగులు చల్లుకుని ఆడుకున్నారు. అనంతరం దగ్గర్లోని నది వద్దకు వెళ్లారు. ప్రమాదవశాత్తూ వారిలో ముగ్గురు పిల్లలు నీటిలో జారి పడిపోయారు. వారికి ఈత రాక మునిగిపోయారు. ఇదంతా చూసిన మరో బాలుడు అంకుర్‌కుమార్ సంజయ్ ప్రసాద్ వెంటనే అప్రమత్తమయ్యాడు. తన ప్రాణాలను పణంగా పెట్టి నీటిలో దూకాడు. ఒకరి తరవాత ఒకరిని ఒడ్డుకు చేర్చాడు. సీపీఆర్ చేయడంతో వారు తేరుకున్నారు. అనంతరం స్థానికుల సాయంతో అంబులెన్స్‌కు ఫోన్ చేశాడు. ఎంతో ధైర్యసాహసాలు కనబరిచి ఆ బాలుర ప్రాణాలు కాపాడిన సంజయ్ పేరు రాష్ట్రవ్యాప్తంగా మార్మోగింది. దీంతో ఆ బాలుడికి రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష బహుమతిని ప్రకటించింది. శుక్రవారం సీఎం ప్రమోద్ సావంత్ చెక్కును అందించి ప్రశంసించారు. 'చిన్న వయసులో ధైర్యసాహలు ప్రదర్శించి తన స్నేహితులను కాపాడిన బాలుడిని కలవటం ఎంతో ఆనందంగా ఉంది. అంకుర్ సరైన సమయంలో సమయస్ఫూర్తితో స్నేహితుల జీవితాలను కాపాడాడు. అతన్ని చూసి గోవా ఎంతో గర్విస్తోంది. అతడిని ప్రోత్సహించేందుకు రూ. లక్ష చెక్కును అందజేశాం. తనకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని ఆశిస్తున్నాను' అని సీఎం ప్రమోద్ సావంత్ ట్వీట్ చేశారు. దీంతో పాటు బాలుడుతో దిగిన ఫోటోను సీఎం సోషల్‌మీడియాలో పోస్టు చేశారు. అటు ప్రతిపక్ష నేతలు, అధికారులు బాలుడి ధైర్యసాహసాలను ప్రశంసించారు.

చెన్నై ఫోర్ట్ రైల్వే స్టేషన్ బోర్డుపై నల్లరంగు పూత



చెన్నై: దక్షిణాది రాష్ట్రమైన తమిళనాడులో హిందీపై వ్యతిరేకత కొనసాగుతున్నది. తాజాగా గుర్తు తెలియని వ్యక్తులు చెన్నై ఫోర్ట్ రైల్వే స్టేషన్ బోర్డుపై ఉన్న హిందీ అక్షరాలపై నల్ల రంగు పూశారు. ఆ బోర్డుపై ఉన్న తమిళం, ఇంగ్లీష్ పేర్ల జోలికి వారు వెళ్లలేదు. శుక్రవారం దీనిని గుర్తించిన రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ బోర్డుపై హిందీ అక్షరాలను తిరిగి రాయించారు. కాగా, చెన్నై ఫోర్ట్ రైల్వే స్టేషన్ బోర్డుపై ఉన్న హిందీ అక్షరాలపై నల్ల రంగు పూయడంపై రైల్వే పోలీసులు ఆరా తీశారు. మద్యం మత్తులో ఉన్న ఇద్దరు వ్యక్తులు ఈ పని చేసినట్లు ప్రయాణికుల నుంచి తెలుసుకున్నారు. దీంతో ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ రైల్వే స్టేషన్‌లోని సీసీటీవీ కెమేరాలు సరిగా పని చేయడం లేదు. దీంతో సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించడం కష్టమని రైల్వే పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం తమిళనాడుపై హిందీని బలవంతంగా రుద్దుతున్నదని సీఎం ఎంకే స్టాలిన్ అనేక సార్లు విమర్శించారు.

కరోనాతో ఐదుగురి మృతి



న్యూదిల్లీ: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా కొత్త కేసుల్లో భారీ పెరుగుదల కనిపిస్తోంది. తాజాగా దేశంలో మూడు వేలకు చేరువలో కొత్త కేసులు నమోదయ్యాయనీ కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. గత 24 గంటల్లో 1,43,364 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 2,994 కొత్త కేసులు బయటపడ్డాయి. మరోవైపు దేశంలో క్రియాశీల కేసుల సంఖ్య 16వేలు దాటాయి ప్రస్తుతం 16,354 కేసులు క్రియాశీలంగా ఉన్నాయి. ఇప్పటి వరకు కరోనా మహమ్మారి నుంచి 4,41,71,551 మంది కోలుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు 24 గంటల వ్యవధిలో కేరళలో ముగ్గురు, గోవా, గుజరాత్‌లో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఐదుగురు మృతి చెందారు. దీంతో కోవిడ్ కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 5,30,876కి చేరింది. ఇక ఇప్పటివరకు నమోదైన మొత్తం క్రియాశీల కేసుల్లో 0.04 శాతం యాక్టివ్‌గా ఉన్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. రికవరీ రేటు 98.77 శాతంగా, మరణాలు 1.19 శాతంగా ఉన్నాయని పేర్కొన్నారు.

మూడోకంటికి చిక్కిన పాపల్‌ప్రీత్

- హోషియార్పూర్ 'డేరా'లో అమృత్‌పాల్ సన్నిహితుడు
- పోలీసుల గాలింపులు ముమ్మరం

చండీగఢ్: ఖలిస్తానీ సానుభూతిపరుడు అమృత్‌పాల్ సింగ్‌కు అత్యంత సన్నిహితుడిగా భావించే పాపల్‌ప్రీత్ సింగ్ హోషియార్పూర్‌లోని ఓ 'డేరా'లో ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు సీసీటీవీ ఫుటేజి వెలుగులోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ఈ ఫుటేజి మార్చి 29వ తేదీకి చెందినది. (అంటే అది అమృత్‌పాల్, ఆయన సహచరుడు కలిసి ఫాగ్వారా నుంచి ప్రయాణించిన ఇన్నోవా వాహనాన్ని పంజాబ్ పోలీసులు ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన బృందం వెంబడించిన తర్వాత రోజు). కాగా 'డేరా' అన్నది ఆధ్యాత్మిక ప్రదేశం. హోషియార్పూర్‌లోని మర్నాయిన్‌కు రెండు, మూడు కిలోమీటర్ల దూరంలోని తనౌలి గ్రామంలో 'డేరా' ఉంది. అక్కడి సీసీటీవీలో పాపల్‌ప్రీత్ సింగ్ దృశ్యాలు రికార్డు అయ్యాయి. పోలీసుల ఛేజింగ్‌తో అమృత్‌పాల్, పాపల్‌ప్రీత్ హోషియార్పూర్‌లో విడిపోయి ఉంటారని భావిస్తున్నారు. వీరిద్దరి కోసం పోలీసులు ఆ ప్రాంతాన్ని జల్లెడ పట్టారు. అనేక అంశాల్లో సలహాలు, సూచనలిస్తూ అమృత్‌పాల్ సింగ్‌కు మార్గదర్శిగా పాపల్‌ప్రీత్ సింగ్ ఉన్నట్లు తెలిసింది. అమృత్‌పాల్ సింగ్ కోసం అన్ని డేరాల్లో పోలీసులు గాలిస్తున్నారు. హోషియార్పూర్ జిల్లాలో అతను నక్కివుండేందుకు ఆస్కారమున్న అన్ని ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. గాలింపు కోసం డ్రోన్‌ను రంగంలోకి దించారు. మార్చి 18 నుంచి అమృత్‌పాల్ సింగ్ పరారీలో ఉన్నాడు. తానేమీ పారిపోలేదని త్వరలోనే అందరి ముందరకు వస్తానని తాజా వీడియోలో అమృత్‌పాల్ వెల్లడించాడు. తన లొంగుబాటుకు సంబంధించి బేరసారాల వార్తలను తోసిపుచ్చుతూ, సర్బత్ ఖాల్సా నిర్వహించి సిక్కు సమాజాన్ని సంఘటితపర్చాలని మరోమారు అకల్ తఖ్త్‌ను కోరాడు. ఇప్పటికే అతని అనుచరులు అనేకమంది పోలీసుల అదుపులో ఉన్నారు.

డీకే కేసు విచారణ వాయిదా

- 6వ తేదీలోగా అభ్యంతరాలు తెలపాలి
- కర్నాటక ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

బెంగళూరు: కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణలో ఉన్న కాంగ్రెస్ కర్నాటక అధ్యక్షుడు డీకే శివకుమార్‌పై అక్రమాస్తుల కేసులో స్టే కాలాన్ని ఏప్రిల్ 6 వరకు ఆ రాష్ట్ర హైకోర్టు పొడిగించింది. ఈ మేరకు ఉత్తర్వులను జస్టిస్ కె.నటరాజన్ ఏకసభ్య ధర్మాసనం జారీచేసింది. తన విచారణకు లభించిన ఆమోదాన్ని సవాల్ చేస్తూ డీకే శివకుమార్ దాఖలు చేసిన మరొక పిటిషన్‌పై అభ్యంతరాలను ఏప్రిల్ 6వ తేదీలోగా తెలుపాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. అప్పటివరకు కేసు విచారణను వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల తేదీని ప్రకటించినందున శివకుమార్ పిటిషన్‌పై అభ్యంతరాల నమోదుకు సమయం కావాలని, కనీసం నాలుగు వారాల గడువు ఇవ్వాలని ప్రభుత్వం తరపు న్యాయవాది కోరారు. సీబీఐ ఏమో విచారణ వేగవంతాన్ని కోరుకుంటుంటే ప్రభుత్వం జాప్యం చేయాలని చూస్తోందని ఏమిటని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే ఏప్రిల్ 6వ తేదీ వరకు విచారణను వాయిదా వేస్తూ ఆలోగా అభ్యంతరాలు తెలియజేయాలని ఉన్నత న్యాయస్థానం సూచించింది.

ఇండోర్ ఆలయ దుర్ఘటనకు

మోట్ల బావిపై అక్రమ నిర్మాణాలే కారణం

కాంగ్రెస్ నేత కమల్ నాథ్ ఆరోపణ



ఇండోర్ : మోట్ల బావిపై అక్రమ కట్టడాలే ఇండోర్ ఆలయ దుర్ఘటనకు దారితీశాయని, ఇందులో 36 మంది ప్రాణాలు కోల్పోయారని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్ నాథ్ ఆరోపించారు. పాలక బీజేపీ ఒత్తిడి కారణంగా స్థానిక పౌర సంఘం మోట్ల బావిపై అనధికారిక నిర్మాణాలను తొలగించలేదని, ఏడు రోజుల్లోగా ఈ అక్రమ నిర్మాణాలను తొలగించకపోతే, మధ్యప్రదేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేస్తానని ఆయన హెచ్చరించారు. శనివారం పటేల్ నగర్‌లోని బేలేశ్వర్ మహాదేవ్ జులేలాల్ ఆలయ ప్రమాద స్థలాన్ని సందర్శించిన కమల్ నాథ్, రాబోయే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, తమ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ స్థలాలపై తప్పనిసరి భద్రతా ఆడిట్ కోసం చట్టం చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు ప్రైవేటు ఆస్పత్రిని కూడా సందర్శించి క్షతగాత్రుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. మోట్ల బావిపై నిర్మించిన ఆలయ నేల గురువారం గుహలో పడటంతో 21 మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు సహా 36 మంది చనిపోయారు. రామ నవమి సందర్భంగా ఆ ప్రదేశంలో 'హవనం' (అగ్ని ఆచారం) జరుగుతుండగా ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన తర్వాత ఆలయ ప్రధాన ద్వారం, మోట్ల బావికి వెళ్లే మార్గాన్ని ఇనుప షీట్ వేసి అధికారులు మూసివేశారు. 'ఈ సంఘటన మోట్ల బావిపై చేసిన అక్రమ నిర్మాణాల ఫలితం. ఇది దేశంలో, ప్రపంచంలో ఇండోర్ ప్రతిష్టను దిగజార్చింది. ఈ అక్రమ కట్టడాలను ఏడు రోజుల్లోగా తొలగించకపోతే వాటిని తొలగించాలని హైకోర్టులో పిల్ దాఖలు చేస్తాం' అని ఆయన విలేకరులతో అన్నారు. అధికార బీజేపీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ (ఐఎంసీ) మోట్ల బావి చుట్టూ ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించలేదని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. 'ఇండోర్‌ను 'స్మార్ట్ సిటీ' అని పిలుస్తారు. అయితే ప్రమాదం తర్వాత మోట్ల బావిలో పడిపోయిన ప్రజలను రక్షించడానికి స్థానిక పరిపాలనకు అవసరమైన పరికరాలు లేవు' అని ఆయన అన్నారు. ప్రమాదం జరిగిన 12 గంటల తర్వాత సహాయక చర్యల కోసం సైన్యాన్ని పిలిచారని, అయితే అప్పటికే చాలా ఆలస్యమైందని చెప్పారు. శుక్రవారం ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ఆసుపత్రిని సందర్శించి క్షతగాత్రుల పరిస్థితిని తెలుసుకుని, విషాద స్థలాన్ని కూడా సందర్శించారు. దీని గురించి కమల్ నాథ్ మాట్లాడుతూ సీఎం చౌహాన్ పర్యటన కేవలం లాంఛనప్రాయమని అన్నారు. బాధితుల బంధువుల బాధను తగ్గించడంలో చౌహాన్ విఫలమయ్యారని ఆరోపించారు. ఈ ఏడాది ఆఖరులోగా జరగనున్న రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, తమ పార్టీ నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రంలోని బహిరంగ ప్రదేశాల్లో తప్పనిసరిగా భద్రతా ఆడిట్ కోసం చట్టం చేస్తుందని, ర్యాపిడ్ రెస్క్యూ ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామని కమల్ నాథ్ తెలిపారు.

కళాక్షేత్రలో లైంగిక వేధింపులపై తమిళనాడులో నిరసన హోరు

చెన్నై: లైంగిక వేధింపుల నిరసనలతో తమిళనాడు హోరెత్తుతోంది. ప్రతిష్ఠాత్మక సంప్రదాయ కళల సంస్థ కళాక్షేత్ర ఈ వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. ఆ సంస్థలోని అసిస్టెంట్ ప్రొఫెసర్, మరో ముగ్గురు ఆర్టిస్టులు తనపై వేధింపులకు పాల్పడ్డారంటూ పూర్వ విద్యార్థిని ఒకరు చేసిన ఆరోపణలు వివాదాస్పదంగా మారాయి. లైంగిక వేధింపులు, బాడీషేమింగ్, దూషణలకు పాల్పడ్డారనే ఆరోపణలపై కొద్దిరోజులుగా దాదాపు 200 మంది విద్యార్థులు ఆందోళన నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కేసు నమోదైంది. శుక్రవారం 90 మంది విద్యార్థులు రాష్ట్ర మహిళా కమిషన్ చీఫ్‌కు ఫిర్యాదుచేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్‌కు లేఖ రాశారు. తప్పు చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. స్టాలిన్‌తోపాటు కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డికి రాసిన లేఖలో ఏళ్లుగా ఈ వేధింపులు, వర్ణ వివక్ష ఎదుర్కొంటున్నామని, ఈ ఫిర్యాదులపై యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. కళాక్షేత్ర డైరెక్టర్ రేవతి రామచంద్రన్‌ను పదవి నుంచి తొలగించాలని కోరారు. ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలు అంటూ జాతీయ మహిళా కమిషన్ తోసిపుచ్చడం గమనార్హం. కురుక్షేత్ర ఫౌండేషన్‌ను 1936లో రుక్మిణీ దేవీ అరుండాలే స్థాపించారు. ఈ సంస్థకు దేశవ్యాప్తంగా ప్రాముఖ్యత ఉంది. ఇక్కడ భరతనాట్యం వంటి సంప్రదాయ కళలకు సంబంధించిన కోర్సులు నేర్పిస్తారు. ఉన్నత ప్రమాణాలు, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచిని ఈ సంస్థ.. ఎంతోమంది ప్రముఖ కళాకారులను తయారుచేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కేసు నమోదు చేసిన నేపథ్యంలో నిరసనను ప్రస్తుతానికి విరమిస్తున్నట్టు విద్యార్థులు తెలిపారు.

గుజరాత్‌లో కాంగ్రెస్ 300 సమ్మేళనాలు

రాహుల్ గాంధీకి ఆహ్వానం

అహ్మదాబాద్ : బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు గుజరాత్ కాంగ్రెస్ ఈ నెలలో రాష్ట్రవ్యాప్తంగా 300 కంటే ఎక్కువ 'సమ్మేళనాలు' (సమావేశాలు) నిర్వహించనుంది. దానిలో భాగం కావాలని పార్టీ అధినేత రాహుల్ గాంధీని ఆహ్వానించింది. ఏప్రిల్ 6-12, అలాగే ఏప్రిల్ 15-25 మధ్య రెండు దశల్లో 251 తాలూకాలు, 33 జిల్లాలు, ఎనిమిది మెట్రో కేంద్రాల్లో ఈ సమ్మేళనాలు నిర్వహించాలని పార్టీ యోచిస్తోందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్ ఠాకూర్ శనివారం విలేకరులతో అన్నారు. తన మద్దతు ఇవ్వడానికి గాంధీని ఏప్రిల్ 20, ఏప్రిల్ 25 మధ్య గుజరాత్‌కు ఆహ్వానించినట్లు ఆయన చెప్పారు. రాహుల్ గాంధీ చివరిసారిగా మార్చి 23న సూరత్‌లో న్యాయస్థానం ముందు హాజరయ్యారు. ఇది ఆయనను క్రిమినల్ పరువు నష్టం కేసులో దోషిగా నిర్ధారించి రెండేళ్ల జైలుశిక్ష విధించి, చివరికి లోక్‌సభ సభ్యునిగా అనర్హతకు దారితీసింది. పోలీసులు అనుమతి ఇస్తారో లేదో అనే దానితో సంబంధం లేకుండా నిరసనలు చేపడతామని ఠాకూర్ తెలిపారు. శాంతియుత నిరసనలకు అనుమతి నిరాకరించడం రాష్ట్రంలో ఆనవాయితీగా మారిందని అన్నారు. నిరసనలకు అనుమతి ఇస్తే సమాజంలోని వివిధ వర్గాలను ప్రభావితం చేసే సమస్యలను పరిష్కరించడంలో విఫలమైనందున భారీ జనసమీకరణకు ప్రభుత్వం భయపడుతోంది. 'ప్రజాస్వామ్యంలో నిరసన కోసం దరఖాస్తు చేసినప్పుడు అధికారులు అనుమతి ఇవ్వడం తప్పనిసరి. కాంగ్రెస్ స్థానిక పోలీసు స్టేషన్లలో అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవాలని నిర్ణయించుకుంది. అనుమతి మంజూరు చేయబడిందా లేదా అనే దానితో సంబంధం లేకుండా తన కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్ణయించుకుంది' అని ఠాకూర్ చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, సమాజంలోని వివిధ వర్గాలను ప్రభావితం చేస్తున్న సమస్యలను 251 తాలూకా కేంద్రాల్లో పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎత్తిచూపేందుకు ఏప్రిల్ 6 నుంచి ఏప్రిల్ 12 మధ్య నిరసనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శాంతిభద్రతలను పట్టించుకోకుండా సామాజిక వ్యతిరేకులను బీజేపీ వాడుకుంటోందని అధికార పార్టీని ఉద్దేశించి ఠాకూర్ అన్నారు.

మహిళా కోటాపై ఇంత అక్కసా?

మున్సిపల్ చట్టం రద్దుపై నాగా మహిళల ఆగ్రహం

కోహిమా: స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే నాగాలాండ్ మున్సిపల్ చట్టం 2001ని రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై మహిళాలోకం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇంతటి కీలకమైన అంశంపై ప్రభుత్వం తమను ఎందుకు సంప్రదించలేదని రాష్ట్రానికి చెందిన ప్రముఖ మహిళా సంఘాలు సూటిగా ప్రశ్నించాయి. కోహిమాలోని నాగాలాండ్ యూనివర్సిటీలో నాగా మదర్స్ అసోసియేషన్(ఎన్ఎంఏ) అధ్వర్యంలో చట్టం రద్దుపై సదస్సు జరిగింది. అనేక మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎంఏ ఓ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. నాగాలాండ్ మున్సిపల్ చట్టం రద్దు నిర్ణయాన్ని నాగాలాండ్ మహిళలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, పౌరులతో చర్చించకుండా...మహిళలను సంప్రదించకుండా ఈ నిర్ణయం తీసుకోవడం దారుణమని ఎన్ఎంఏ విమర్శించింది. చట్టం రద్దుపై అసెంబ్లీలో చర్చ జరుగుతుంటే ఇద్దరు మహిళా ఎమ్మెల్యేలు మౌనంగా ఉండటం సిగ్గుచేటని విమర్శించింది. నాగా ఉమెన్ హోహో దిమాపూర్, జెలియంగ్‌రాంగ్ మెపు సంస్థ, పోచురి మదర్స్ అసోసియేషన్‌తో పాటు ఎన్‌డీపీపీ, బీజేపీ, ఎన్‌పీఎఫ్‌పార్టీల ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. గిరిజన సంస్థలు, పౌరసంఘాల నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా మున్సిపల్ చట్టాన్ని రద్దు చేస్తూ నాగాలాండ్ అసెంబ్లీ మంగళవారం తీర్మానాన్ని ఆమోదించింది. మున్సిపల్ చట్టం రద్దు నేపథ్యంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ ఎన్నికలు రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ గురువారం ప్రకటించింది. మహిళలకు 33శాతం రిజర్వేషన్ల కల్పించడం, భూమి, భవనాలపై లేవీ పన్నులు విధించే మున్సిపల్ చట్టానికి గిరిజన సంఘాలు తీవ్ర వ్యతిరేకంగా ఉన్నాయి. నాగాలాండ్‌కు ప్రత్యేక అధికారాలు కల్పించే రాజ్యాంగంలోని ఆర్టికల్ 371ఏకు ఈ చట్టం వ్యతిరేకమని వాదిస్తున్నాయి.

కేంద్ర సంస్థల ఒత్తిడిని షా అంగీకరించినట్లేగా: తేజస్వీ

పాట్నా: గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మోదీని బూటకపు ఎన్‌కౌంటర్‌లో కేసులో ఇరికించే ప్రయత్నాలు జరిగాయని, నాటి కాంగ్రెస్ నేతృత్వ యూపీఏ హయాంలో సీబీఐ నుంచి ఒత్తిడి ఎదుర్కొన్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీహార్ ఉపముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ స్పందిస్తూ షా వ్యాఖ్యల గురించి, ఆయన మాటల్లో నిజం ఎంతో తెలియదన్నారు. ఒత్తిడి అనే పదాన్ని వినియోగించారు కాబట్టి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఒత్తిడి చేస్తున్నాయని ఆయన ఒప్పుకున్నట్టేగా అన్నారు. ఈ లెక్కన ఆ సంస్థలను నిష్పాక్షికంగా, పారదర్శకంగా పనిచేయనివ్వడం లేదా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, ఆర్జేడీకి పాత మిత్రపక్షం నాయకుడు రాహుల్ గాంధీపై అనర్హత వేటు గురించి మాట్లాడుతూ 'సమయమే అన్నింటికీ సమాధానం చెబుతుంది. కాలచక్రాన్ని తిరగనివ్వండి. సరైన సమయానికి లెక్క తేలుతుంది' అని అన్నారు. విద్యుత్ రంగంలో 'ఒక దేశం, ఒక టారిఫ్' విధానం కోసం సీఎం నితీశ్ కుమార్ విన్నపాన్ని కేంద్రం పట్టించుకోలేదన్నారు. ప్రస్తుతం సంపన్న రాష్ట్రాల నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం. బీహార్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించినట్లు వినియోగదారులపై భారాన్ని తగ్గించేందుకు రూ.13వేల కోట్ల సబ్సిడీని రాష్ట్ర కేబినెట్ ఆమోదించిందని తేజస్వీ చెప్పారు. ప్రస్తుతం కుటుంబసమేతంగా దిల్లీలో ఉన్న తేజస్వీ తాను తండ్రి అయిన విషయాన్ని పంచుకుంటూ ఆనందం వ్యక్తంచేశారు. నవరాత్రి, రమదాన్, లెంట్ (క్రైస్తవులకు పవిత్ర సమయం) వేళ తనకు కుమార్తె జన్మించడం సంతోషంగా ఉందని చెప్పారు. 'నా కుమార్తెకు కత్యాయని అన్న పేరును నాన్న పెట్టారు. కత్యాయని అంటే నవరాత్రి ఆరవ రోజు పూజించే దేవత. నా బిడ్డ అదే రోజు పుట్టింది' అని తేజస్వీ తెలిపారు. మొదటిసారి తండ్రి అయిన ఆయనకు తోటివారంతా శుభాకాంక్షలు తెలిపారు.

ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్-ఇజ్రాయిల్ సహకారం పెంచుకోవాలి

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

న్యూదిల్లీ : ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి భారత్-ఇజ్రాయెల్ మధ్య మరింత లోతైన సహకారం అవసరమని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పిలుపునిచ్చారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాల నేపథ్యంలో భారతదేశం, ఇజ్రాయెల్ మధ్య సంబంధాలు మరింత ముఖ్యమైనవిగా మారాయని అన్నారు. భారత్‌కు వచ్చిన ఇజ్రాయిల్ పార్లమెంటరీ బృందానికి స్వాగతం పలుకుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్‌పర్సన్ జగదీప్ ధన్కర్, స్పీకర్ బిర్లా సంయుక్త ఆహ్వానం మేరకు ఇజ్రాయెల్ నెస్సెట్ (పార్లమెంట్) స్పీకర్ అమీర్ ఒహానా నేతృత్వంలోని ప్రతినిధి బృందం భారతదేశం వచ్చింది. ఈ ప్రతినిధి బృందం మార్చి 31-ఏప్రిల్ 4 మధ్య దేశంలో పర్యటిస్తుంది. స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఒహానా తొలి విదేశీ పర్యటన ఇదని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది. బిర్లా మాట్లాడుతూ ఇజ్రాయెల్, భారతదేశం సాంప్రదాయకంగా సన్నిహిత, స్నేహపూర్వక సంబంధాలను కలిగి ఉన్నాయని తెలిపారు. రెండు దేశాలు బలమైన ప్రజాస్వామ్య వారసత్వాన్ని పంచుకుంటున్నాయని, తోటి ప్రజాస్వామ్యాలుగా విభిన్న సంస్కృతులను గౌరవించడం, ప్రజాస్వామ్య విలువలను అనుసరించడం వంటి అనేక సారూప్యతలు కలిగి ఉన్నాయని అన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత్, ఇజ్రాయెల్ ఉమ్మడి వ్యూహం ప్రపంచానికి కొత్త దిశానిర్దేశం చేస్తుందని ఉద్ఘాటించారు. భారతదేశంలోని యూదు సమాజాన్ని ప్రస్తావిస్తూ, భారతదేశం ఎల్లప్పుడూ వారికి మద్దతునిస్తుందని, సురక్షితమైన పర్యావరణ వ్యవస్థను అందించిందని అన్నారు. ఇజ్రాయెల్ యువతకు పర్యాటక కేంద్రంగా భారతదేశం ప్రజాదరణ గురించి మాట్లాడుతూ రెండు దేశాల మధ్య మరింత ప్రయాణ, పర్యాటకానికి బిర్లా పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఒహానా మాట్లాడుతూ భారత్, ఇజ్రాయెల్ రెండూ పాత నాగరికతలేనని, కాలక్రమేణా దేశాల మధ్య సంబంధాలు బలపడుతున్నాయని అన్నారు. భారతదేశ పురోగతిని ప్రస్తావిస్తూ, అన్ని రంగాల్లో అద్భుతంగా ఎదుగుతోందని తెలిపారు. భారతదేశం, ఇజ్రాయెల్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని, ప్రపంచ సవాళ్లను రెండూ సమష్టిగా ఎదుర్కొంటాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉద్యమాలతోనే ఉద్యోగాల సాధన

ఏఐవైఎఫ్ రాయలసీమ జిల్లాల వర్క్ షాప్‌లో తిరుమలై రామన్, ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కర్నూలు: యువత ఉద్యమాల ద్వారానే ఉద్యోగాలు సాధించుకోవాలని, స్థానిక సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై రామన్, యువజన సమాఖ్య జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కేసీ కెనాల్ వద్ద గల చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాయలసీమ జిల్లాల ముఖ్య నాయకుల సమావేశం ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర బాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా హాజరయిన తిరుమలై రామన్, ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన బాధ్యత యువతపై ఉందని అన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాని మోదీ ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని, ప్రభుత్వ రంగ సంస్థలు బీఎస్ఎన్ఎల్, రైల్వే, ఎల్ఐసీ, కోల్, విశాఖ ఉక్కు పరిశ్రమలను అంబానీ, అదానీ లాంటి వారికి కట్టబెడుతూ, వారికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. అదానీ ఆస్తుల నష్టాన్ని పూడ్చేందుకు సామాన్య ప్రజల మీద భారాలు మోపుతున్నారని, ఒకపక్క సామాన్యుడికి కొనుగోలు శక్తి 41 శాతానికి దిగజారిపోతుంటే మరోపక్క సాధారణ వస్తువులు, గృహోపకరణాలు, ఆహార పదార్థాల మీద పన్నుల భారం మోపుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. డిజిటల్ ఇండియా పేరుతో యూపీఐ, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం లాంటి యాప్‌లకు లావాదేవీలు చేసినట్లయితే పన్నులు కట్టాలంటూ పేద ప్రజల మీద గుదిబండ వేస్తున్నారని విమర్శించారు. ఇక రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న రెండు లక్షల పైచిలుకు ఉద్యోగాలు భర్తీ చేస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాలవుతున్న ఒక్క ప్రభుత్వ ఉద్యోగానికి కూడా నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టుల భర్తీ కోసం, యువజన సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమించాలని వారు పిలుపు ఇచ్చారు.

యువజన సమ్మేళనాలను జయప్రదం చేయండి: రాజేంద్ర బాబు, లెనిన్ బాబు

మే 20 నుంచి 24 వరకు గుంటూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి విద్యా, వైజ్ఞానిక, రాజకీయ, సాంస్కృతిక యువజన సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు పిలుపు ఇచ్చారు. రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిరంకుశ విధానాలపై చర్చించి భవిష్యత్ పోరాటానికి కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు. శిక్షణా తరగతులకు ఏఐవైఎఫ్ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటు సభ్యులు సంతోష్ కుమార్, కేరళ మాజీ మంత్రి వినయ్ విశ్వం, సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, వందేమాతరం శ్రీనివాస్, గోరేటి వెంకన్న, ప్రొఫెసర్ ఖాసీం, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్ లాంటి ప్రముఖులతో పాటు విద్యావేత్తలు, మేధావులు పాల్గొని అనేక అంశాలపై చర్చిస్తారని, యువజన సమ్మేళనాల జయప్రదానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానానికి వ్యతిరేకంగా ఏప్రిల్ 14 నుంచి మే 15 వరకు జాతీయ సమితి పిలుపులో భాగంగా ప్రచారం ఆందోళనలో పాల్గొనాలని, రోజురోజుకు ఆన్ లైన్‌లో పెరిగిపోతున్న మోసాలు, అశ్లీలతను నియంత్రించాలని ఏప్రిల్ 10న రాష్ట్రవ్యాప్తంగా పోలీసు అధికారులకు, రెవెన్యూ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆఫీస్ బేరర్లు జి.సంతోష్ కుమార్, నాగరాముడు, కత్తి రవి, యు.కారుమంచి, గంగా సురేష్, శ్రీనివాసులు, జక్కుల వెంకటేష్, శ్రీరాములు, రణత్యాదవ్ లతో పాటు 8 జిల్లాల యువజన సమాఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

గుజరాత్ హైకోర్టు ఆదేశాలతో
ప్రజలు ఆశ్చర్యపోయారు

ప్రధాని మోదీ డిగ్రీపై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్హత గురించి తెలుసుకునే హక్కు ఉన్న ప్రజలు గుజరాత్ హైకోర్టు తీర్పుతో దిగ్భ్రాంతికి గురయ్యారని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ శనివారం అన్నారు. మోదీ డిగ్రీకి సంబంధించిన సమాచారాన్ని కేజ్రీవాల్‌కు అందించాలని గుజరాత్ విశ్వవిద్యాలయాన్ని కోరుతూ కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ఏడేళ్ల నాటి ఉత్తర్వులను గుజరాత్ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది. సీఐసీ ఉత్తర్వుపై గుజరాత్ విశ్వవిద్యాలయం అప్పీల్‌ను అనుమతిస్తూ, న్యాయమూర్తి జస్టిస్ బిరెన్ వైష్ణవ్ కూడా కేజ్రీవాల్‌కు రూ.25 వేల జరిమానా విధించారు. ఆ మొత్తాన్ని గుజరాత్ రాష్ట్ర న్యాయ సలహా మండలి (జీఎస్ఎల్ఎస్ఏ) కు నాలుగు వారాల్లోగా జమ చేయాలని కోరారు. 'ప్రజాస్వామ్యంలో సమాచారం కోరుకునే, ప్రశ్నలు అడిగే స్వేచ్ఛ ఉండాల్సి ఉన్నందున హైకోర్టు ఆదేశాలతో దేశం మొత్తం ఆశ్చర్యపోయింది' అని కేజ్రీవాల్ ఇక్కడ విలేకరుల సమావేశంలో అన్నారు. 'హైకోర్టు ఉత్తర్వులు ప్రధాని విద్యాభ్యాసంపై అనుమానాన్ని పెంచాయి' అని ఆయన ఆరోపించారు. ప్రధాని గుజరాత్ విశ్వవిద్యాలయం లేదా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చదివి ఉంటే, వారు దానికి పండుగ చేసుకోవాలి, బదులుగా వారు సమాచారాన్ని దాచిపెడుతున్నారని ఢిల్లీ ముఖ్యమంత్రి అన్నారు. మోదీకి చెల్లుబాటయ్యే డిగ్రీ ఉంటే గుజరాత్ విశ్వవిద్యాలయం ఎందుకు చూపించడం లేదని ప్రశ్నించారు. ప్రధాని విద్యార్హతపై సమాచారం ఇవ్వడానికి గుజరాత్ విశ్వవిద్యాలయం సిద్ధంగా లేకపోవడానికి కేవలం రెండు కారణాలు మాత్రమే ఉన్నాయని, అది మోదీ అహంకారం వల్ల కావచ్చు లేదా ఆయన డిగ్రీ నకిలీదని కేజ్రీవాల్ అన్నారు. అయినప్పటికీ, దేశంలో చాలా పేదరికం ఉన్నందున నిరక్షరాస్యులుగా ఉండటం 'నేరం' కాదని ఆయన అన్నారు. 'కుటుంబాలలో ఆర్థిక పరిస్థితుల కారణంగా మనలో చాలామంది అధికారిక విద్యను పొందే స్థితిలో లేము. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా ఇలాంటి పేదరికం దేశాన్ని పీడిస్తూనే ఉంది' అని తెలిపారు. దేశానికి 'అత్యున్నత నిర్వాహకుడు' అయినప్పటి నుంచి మోదీ ప్రతిరోజు శాస్త్ర, ఆర్థిక శాఖలకు సంబంధించిన అనేక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుందని అన్నారు. 'ప్రధాన మంత్రికి చదువు రాకపోతే, అధికారులు, వివిధ రకాల వ్యక్తులు వచ్చి ఎక్కడైనా ఆయన సంతకం తీసుకుంటారు. ఆయన నుంచి నోట్ల రద్దు (డిమోనిటైజేషన్) వంటి ఏదైనా అమలు చేస్తారు. దీని వల్ల దేశం చాలా నష్టపోయింది' అని ఆయన అన్నారు. ప్రధాని మోదీకి విద్యాబుద్ధులు ఉంటే నోట్ల రద్దును అమలు చేసి ఉండేవారు కాదని కేజ్రీవాల్ తెలిపారు.

రేపట్నుంచి ఒంటిపూట బడులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో ఒంటిపూట బడులపై నెలకొన్న వివాదానికి తెరపడింది. వేసవిలోకి ప్రవేశించినా ఇంకా స్కూళ్లకు ఒంటిపూట సెలవులు ప్రకటించకపోవడంపై విద్యార్థి సంఘాలు ఆందోళనలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం శనివారం స్పందించింది. విజయవాడలో మీడియాతో మాట్లాడిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఒంటిపూట బడులపై ఓ ప్రకటన చేశారు. ఎండలు ఎక్కువగా లేవని కారణంతో ఒంటి పూట బడులు ఇప్పటివరకు పెట్టలేదని తెలిపారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఈ మేరకు 3వ తేదీ నుంచి ఒంటిపూట బడుల నిర్వహణకు సిద్ధం కావాలని తెలిపారు. ప్రైవేటు స్కూళ్లు ఈ ఉత్తర్వులను ధిక్కరించి బడులు నడిపితే చర్యలు తప్పవని బొత్స హెచ్చరించారు. ఉదయం 7.45 నుంచి 12.30 వరకూ మాత్రమే పాఠశాలల పని వేళలుగా నిర్ణయిస్తూ విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. తరగతి గదులు బహిరంగంగా కాని, చెట్ల కింద కాని నిర్వహించడానికి వీల్లేదని, తాగునీటి సౌకర్యం కచ్చితంగా ఏర్పాటు చేయాలని, మధ్యాహ్న భోజనంతో పాటు మజ్జిగ అందజేసేలా చర్యలు తీసుకోవాలని, వడదెబ్బ నివారణ చర్యలు చేపట్టాలని సూచిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జగన్‌ను సాగనంపేందుకు ప్రజలు సిద్ధం

- చాలా మంది వైసీపీ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు
- వివేకా హత్య కేసు దేశ చరిత్రలో సస్పెన్స్ థ్రిల్లర్
- టీడీపీ అధినేత చంద్రబాబు మీడియాతో చిట్‌చాట్



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగన్‌ను ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అన్నారు. 175 స్థానాల్లో వైసీపీని ఓడించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఎన్నికలు ఎప్పుడు పెట్టినా తాము సిద్ధమేనని స్పష్టం చేశారు. ముందస్తుకు తాము సిద్ధంగా లేమని జగన్ భావిస్తే అది పగటికలే అవుతుందని చెప్పారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడిన చంద్రబాబు అనేక ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. చాలా మంది వైసీపీ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని తెలిపారు. వైసీపీలో నేతలు బానిసల్లా బతుకుతున్నారని తెలిపారు. మాజీ మంత్రి వైఎస్ వివేకా హత్య కేసు దేశ చరిత్రలోనే సస్పెన్స్ థ్రిల్లర్‌గా అభివర్ణించారు. ఫిక్షన్ కథలు రాసే వారు కూడా ఇలాంటివి రాయలేరు. ఇన్ని ట్విస్టులు ఉన్న కేసు దేశంలో మరొకటి లేదన్నారు. ఇలాంటి కేసును ఛేదించకపోతే వ్యవస్థల మీద నమ్మకం పోతుందన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి షాక్ ట్రీట్‌మెంట్ ఇచ్చారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో శాశ్వత చికిత్స చేస్తారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ఫలితాలపై సజ్జల ఒకటంటే, మంత్రి బొత్స మరొకటి అంటున్నారని విమర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన వైఫల్యం ఉందన్న బొత్స సత్యనారాయణ రాజీనామా చేయొచ్చు కదా? అన్నారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఉన్న 23 మంది సభ్యుల బలంతోనే ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించుకున్నామని చెప్పారు. తమ పార్టీ నుంచి ఎమ్మెల్యేలను తీసుకెళ్లిన వైసీపీ తిరిగి నిందలు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఏ ఎమ్మెల్యే వచ్చినా రాజీనామా చేసి రావాలని జగన్ అసెంబ్లీలో అనలేదా? అని చంద్రబాబు ప్రశ్నించారు. నీతిమాలిన పనులు చేస్తూ తిరిగి తెలుగుదేశంపై నిందలు వేస్తారా అని నిలదీశారు. ఎమ్మెల్యే కోటాలో తెలుగుదేశానికి రావాల్సిన ఒక సీటు కోసం పోటీ చేయడం అనైతికమనడం బుద్ధిలేని తనంకాక మరేంటని ఆక్షేపించారు. ఏప్రిల్ ఫూల్ అనే పదం జగన్‌కి సరిగ్గా సరిపోతుందని ఎద్దేవా చేశారు. ప్రజలందరినీ ఎల్లకాలం ఫూల్స్ చేయొచ్చనే భ్రమలో ఉన్నారని, కానీ, ప్రజలంతా కలిసి ఆయనను ఫూల్ చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. తాను పుట్టిందే రాష్ట్ర విధ్వంసం కోసం అన్నట్లుగా జగన్ ప్రవర్తిస్తున్నాడని విమర్శించారు. ఈ ముఖ్యమంత్రి చెడు ఆలోచనలు అంచనా వేయటం కష్టమేమో కానీ, అతని భవిష్యత్తు ఏంటో ప్రజలంతా అంచనా వేస్తున్నారని చంద్రబాబు చెప్పారు.

రాహుల్‌కు బిగుస్తున్న ఉచ్చు

వరుసగా పరువునష్టం కేసులు నమోదు

న్యూఢిల్లీ/డెహ్రాడూన్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి న్యాయపరంగా ఉచ్చు బిగుస్తోంది. ఆయనపై వరుసపెట్టి పరువు నష్టం కేసులు నమోదవుతున్నాయి. మొన్న లలిత్ మోదీ నిన్న బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ తాజాగా ఆర్ఎస్ఎస్ కార్యకర్త ఒకరు పరువు నష్టం దావా వేశారు. 2019 లోక్‌సభ ఎన్నికలప్పుడు కర్నాటకలోని కోలార్‌లో చేసిన వ్యాఖ్యలపై పాట్నా చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేసినట్లు సుశీల్ కుమార్ మోదీ తెలిపారు. ఇదిలావుంటే భారత్ జోడో యాత్ర సందర్భంగా బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌పై రాహుల్ విమర్శలు చేశారు. జనవరి 9న ప్రసంగించిన ఆయన ఆర్ఎస్ఎస్ సభ్యులు 21వ శతాబ్దపు కౌరవులు ఉన్నారు. 'కౌరవులు ఎవరు? ముందుగా మీకు 21వ శతాబ్దపు కౌరవుల గురించి చెబుతాను. వారు హాఫ్ ఖాకీ ప్యాంటు ధరిస్తారు. చేతిలో లాఠీలు, శాఖలు పట్టుకుంటారు. దేశంలోని ఇద్దరు, ముగ్గురు బిలియనీర్లు ఆ కౌరవుల వెంట ఉన్నారు' అని పరోక్షంగా రాహుల్ వ్యాఖ్యానించారు. దీంతో ఉత్తరాఖండ్‌కు చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కమల్ భదౌరియా హరిద్వార్ కోర్టును ఆశ్రయించి రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు వేశారు. ఈనెల 12న దీనిపై కోర్టు విచారణ జరుగుతుంది.

సూర్యతో లోకేశ్ సినిమా

చెన్నై: 'రోలెక్స్' ఇండస్ట్రీని షేక్ చేసిన ఓ పాత్ర పేరు ఇది. కమల్‌హాసన్ నటించిన 'విక్రమ్'లో సూర్య పోషించిన ఈ పాత్రకు సినీ ప్రియులు ఎంతగానో ఫిదా అయ్యారు. ఇదే విషయంపై తాజాగా కమల్ హాసన్ మాట్లాడారు. చెన్నైలో జరిగిన ఓ అవార్డుల కార్యక్రమంలో పాల్గొన్న కమల్‌హాసన్, ఓ విభాగంలో సూర్యకు అవార్డు అందించారు. 'రోలెక్స్ పాత్ర.. మా సినిమా మరెంతో మందికి చేరువయ్యేలా చేసింది. ఈ పాత్ర చేయడానికి అంగీకరించినం దుకు సూర్యకు మరోసారి ధన్యవాదాలు. ఇది మేము చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయం. ఒక్క ఫోన్‌కాల్ చేసిన వెంటనే సూర్య ఈ పాత్ర చేయడానికి ఓకే అన్నాడు" అంటూ సూర్యని హత్తుకుని ఆయన నుదిటిపై కమల్ ముద్దుపెట్టుకున్నారు. దీనికి సంబంధించిన పలు ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. 'విక్రమ్-రోలెక్స్‌ను ఒకే స్టేజ్‌పై చూడటం ఆనందంగా ఉంది' అంటూ నెటిజన్లు అంటున్నారు. సూర్యతో సినిమా చేయడంపై 'విక్రమ్' దర్శకుడు లోకేశ్ క్లారిటీ ఇచ్చారు. తాను త్వరలోనే సూర్యతో ఓ సినిమా చేస్తానని అన్నారు. "సూర్యతో ప్రాజెక్ట్ చేయాలని నాక్కూడా ఆసక్తిగా ఉంది. తప్పకుండా ఆయనతో సినిమా చేస్తా. 150 రోజుల్లోనే దాన్ని పూర్తి చేస్తా" అని ఆయన వెల్లడించారు. ఈ వ్యాఖ్యలపై సూర్య అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, లోకేశ్ ప్రస్తుతం విజయ్‌తో 'లియో' చేస్తోన్న విషయం తెలిసిందే.

అప్పుడు మోహన్‌బాబు నా ఆఫర్ వద్దన్నారు: గుణశేఖర్

హైదరాబాద్: గతంలో నటుడు మోహన్‌బాబు తన ఆఫర్‌ను రిజెక్ట్ చేశారని ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ అన్నారు. తాను తెరకెక్కించిన ఓ సినిమాలో కీలకపాత్ర కోసం మోహన్‌బాబుని సంప్రదించగా.. సున్నితంగా తిరస్కరించారని తెలిపారు. త్వరలో విడుదల కానున్న 'శాకుంతలం'లో దుర్వాస మహర్షి పాత్ర కోసం మోహన్‌బాబును ఎంచుకోవడంపై గుణశేఖర్ స్పందిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. 'శాకుంతలం'కు మోహన్‌బాబు నా ఛాయిస్ కాదు. మహాకవి కాళిదాసు ఛాయిస్. ఎందుకంటే కాళిదాసు వర్ణన చదివిన తర్వాత.. దుర్వాస మహర్షి పాత్రకు నూటికి నూరు శాతం ఆయనే న్యాయం చేయగలడని అనిపించింది. గతంలో 'రుద్రమదేవి'లో ఓ పాత్రకు అడిగితే ఆయన సున్నితంగా తిరస్కరించారు. దాంతో, ఆరోజు ఆయన్ని బలవంతం చేయలేదు. కానీ, 'శాకుంతలం' అనుకున్నాక.. ఆయన్ని కలిశాను. 'సర్.. ఈసారి మీరు నో చెప్పలేని పాత్రతో వచ్చాను. ఒకవేళ మీరు చేయను అంటే ప్రత్యామ్నాయం ఎవరో మీరే చెప్పండి?' అని అడిగాను. దానికి ఆయన ప్రాజెక్ట్ ఏమిటి? పాత్ర ఏమిటి? అని ప్రశ్నించగా.. 'శాకుంతలం'లో దుర్వాస మహర్షి పాత్రని చెప్పా. వెంటనే ఆయన పెద్దగా నవ్వి.. 'కోపిష్టి అని నా వద్దకు వచ్చావా?' అని అడిగారు. దుర్వాసునిలో కోపం ఒక్కటే గుణం కాదు.. ఆయనో గొప్ప మహర్షి అని బదులిచ్చా. దానికి ఆయన.. ఈ పాత్ర నేనే చేస్తానంటూ అంగీకారం తెలిపారు' అని గుణశేఖర్ వివరించారు.

'దసరా'లో సన్నివేశం తొలగించాలని ధర్నా

హైదరాబాద్: నేచురల్ స్టార్ నాని, కీర్తి సురేశ్ హీరో, హీరోయిన్‌గా నటించిన సినిమా 'దసరా'. కొత్త దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహించారు. ఈ చిత్రం పాన్ ఇండియాగా రూపొందింది. అనేక భాషల్లో ప్రపంచవ్యాప్తంగా మార్చి 30న విడుదలైంది. ఈ మూవీ ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే హిట్ టాక్‌ను తెచ్చుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో కలెక్షన్స్‌ను రాబడుతుండగానే సినిమాలోని ఓ సన్నివేశంపై వివాదం రేగింది. కీర్తి సురేశ్ 'దసరా'లో వెన్నెల అనే పాత్రను పోషించారు. అంగన్‌వాడీ టీచర్‌గా నటించారు. ఈ చిత్రంలోని ఓ సన్నివేశంలో కీర్తి సురేశ్ కోడిగుడ్లను దొంగతనం చేసి అమ్ముకుంటున్నట్లు చూపించారు. ఆ గుడ్లను తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు ఇచ్చినట్టు చిత్రీకరించారు. ఈ సీన్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని థియేటర్ వద్ద ధర్నా చేశారు. ఆ సీన్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. క్షమాపణలు చెప్పాలని కోరుతున్నారు. సన్నివేశాన్ని తొలగించకపోతే సినిమాను ప్రదర్శిస్తున్న థియేటర్స్ వద్ద నిరసనకు దిగుతామని హెచ్చరించారు. దసరా సినిమా వీర్లపల్లి అనే గ్రామం నేపథ్యంలో రూపొందింది. చిత్రంపై విడుదలకు ముందే భారీ బజ్ ఉంది. మూవీ ఆ అంచనాలను మించి రాణిస్తోంది. వరల్డ్ వైడ్‌గా రెండు రోజుల్లోనే రూ.53కోట్ల గ్రాస్ వసూళ్లను రాబట్టింది.

కోల్‌కతాపై
పంజాబ్ కింగ్స్ విజయం

మొహాలీ: ఐపీఎల్ 16వ సీజన్ రెండో మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ శుభారంభం చేసింది. కాకపోతే డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో తొలి విజయం వరించింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో శనివారం పీసీఏ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో ఏడు పరుగుల తేడాతో విజయం సాధించింది.192 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ వర్షం పడే సమయానికి 16 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. వర్షం ఎంతకీ తెరిపినివ్వకపోవడంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతి అమలు చేశారు. ఈ లెక్కన కేకేఆర్ ఏడు పరుగులు వెనుకబడి ఉంది. దీంతో పంజాబ్ మ్యాచ్ గెలిచినట్లు అంపైర్లు ప్రకటించారు. పంజాబ్ బౌలర్ అర్షదీప్ సింగ్ 19 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకొని మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందుకున్నాడు. అంతకముందు తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. బానుక రాజపక్స 50 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. శిఖర్ ధావన్ 40 రాణించాడు. చివర్లో సామ్ కరన్ 17 బంతుల్లో రెండు సిక్సర్ల సాయంతో 26 నాటౌట్, షారుక్ ఖాన్ ఏడు బంతుల్లో 11 పరుగులు నాటౌట్ దాటిగా ఆడారు. కేకేఆర్ బౌలర్లలో టిమ్ సౌథీ రెండు వికెట్లు పడగొట్టగా.. వరుణ్ చక్రవర్తి, ఉమేశ్ యాదవ్, సునీల్ నరైన్‌లు తలా ఒక వికెట్ తీశారు. కేకేఆర్ 16 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసిన సమయానికే మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన కేకేఆర్‌ను రసెల్, వెంకటేశ్ అయ్యర్‌లు నిలబెట్టే ప్రయత్నం చేశారు. నిజానికి డక్‌వర్త్ లూయిస్ పద్ధతి అనుసరించే పరిస్థితి లేకపోయినా ఈ మ్యాచ్‌లో పంజాబ్ గెలిచేదే. 29 పరుగులకే తొలి మూడు వికెట్లు కోల్పోయింది. అంతకుముందు, పంజాబ్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. బానుక రాజపక్స 50 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. శిఖర్ ధావన్ 40 రాణించాడు. చివర్లో సామ్ కరన్ 17 బంతుల్లో రెండు సిక్సర్ల సాయంతో 26 నాటౌట్, షారుక్ ఖాన్ ఏడు బంతుల్లో 11 పరుగులు నాటౌట్ దాటిగా ఆడారు. కేకేఆర్ బౌలర్లలో టిమ్ సౌథీ రెండు వికెట్లు పడగొట్టగా.. వరుణ్ చక్రవర్తి, ఉమేశ్ యాదవ్, సునీల్ నరైన్‌లు తలా ఒక వికెట్ తీశారు.

జీఎస్టీ వసూళ్ల జోరు

- మార్చిలో 13 శాతం అధికం
- రిటర్న్స్ ఫైలింగ్‌లోనూ రికార్డు: కేంద్ర ఆర్థికశాఖ

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు పెరిగాయి. మార్చిలో 13శాతం పెంపుదలతో రూ.1.60 లక్షల కోట్లు వచ్చాయి. పరోక్ష పన్ను విధానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత ఇంత భారీగా వసూళ్లు జరగడం ఇది రెండవసారి. రిటర్న్ ఫైలింగ్‌లోనూ మార్చినెల రికార్డు నెలకొల్పింది. ఈనెలలో స్థూల జీఎస్టీ ఆదాయం రూ.1,60,122 కోట్లు కాగా 93.2శాతం మేర ఫైలింగ్స్ జరిగా యని కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ శనివారం ఒక ప్రకట నలో తెలిపింది. ఇందులో కేంద్ర జీఎస్టీ రూ.29,549 కోట్లు కాగా రాష్ట్ర జీఎస్టీ రూ.37,314 కోట్లు, సమగ్ర జీఎస్టీ రూ.82,907 కోట్లు (సరుకు దిగుమతులపై వసూలైన రూ.42,503 కోట్లు కలిపి), సెస్ రూ.10,355 కోట్లని వెల్లడించింది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తంగా రూ.18.10 లక్షల కోట్లు రాగా ఈసారి 22శాతం ఎక్కువగా వసూలైనట్లు ప్రకటన తెలిపింది. ఏడాది మొత్తానికి సగటు స్థూల నెలసరి వసూళ్లు రూ.1,51 లక్షలకోట్లని పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.1.5లక్షలకోట్ల మార్కును జీఎస్టీ వసూళ్లు దాటడం ఇది నాల్గోసారి కాగా మార్చిలో ఇంత వసూలు కావడం రెండవ సారిగా తెలిపింది. గతనెలలోనూ ఐజీఎస్టీ అధిక వసూళ్లు జరిగినట్లు ఆర్థిక శాఖ పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో రూ.1.68 లక్షల కోట్లకు చేరింది. 2023 మార్చినెల ఆదాయం గతేడాది ఇదే నెలలో వచ్చిన దానికంటే 13శాతం ఎక్కువని ఆర్థికశాఖ వెల్లడించింది. మార్చి నెలలో సరుకు దిగుమతులు, దేశీయ లావాదేవీల నుంచి వచ్చి ఆదాయం గతేడాది ఇదే నెలలో వచ్చిన దాని కంటే ఎనిమిది, 14శాతం చొప్పున పెరిగినట్లు తెలి పింది. అదే విధంగా రిటర్న్ ఫైలింగ్‌లోనూ మార్చి నెల రికార్డు నెలకొల్పిందని పేర్కొంది. జీఎస్టీఆర్-1కు సంబంధించి 93.2శాతం రిటర్న్స్ ఫైల్ కాగా ఫిబ్రవరికి చెందిన జీఎస్టీఆర్-3బీలో 91.4శాతం రిటర్న్స్ దాఖలైనట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది.

5 లక్షల గిరిజనుల ఆహార హక్కు హరణ

అహ్మదాబాద్: పేదలకు ఉచిత రేషన్ అందించేందుకు తెచ్చిన జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని నీరుగార్చే విధంగా గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఎలాంటి ఆర్థిక సర్వే జరపకుండానే అదనపు కార్డులు ఉన్నాయన్న నెపంతో స్థానిక ఆదివాసీ కుటుంబాల ఆహార హక్కును హరించే విధంగా నిర్ణయం తీసుకుంది. వారి రేషన్ కార్డుల రద్దునకు ఆదేశాలు జారీచేసింది. ఐదు లక్షల మందితో కూడుకున్న 80వేలకుపైగా ఉన్న ఆదివాసీ/గిరిజన కుటుంబాల తమ రేషన్ కార్డును కోల్పోనున్నాయి. 81.35 కోట్ల మంది పేదలకు ఎన్ఎఫ్ఎస్ఏ కింద ఉచిత రేషన్ అందించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిన వేళ గుజరాత్ ప్రభుత్వం తాజా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. అయితే తమ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఉన్న ప్రజలకంటే రేషన్ కార్డులు ఎక్కువగా ఉన్నాయని, అందుకే అదనపు కార్డులను రద్దు చేస్తున్నామని గుజరాత్ ప్రభుత్వం సమర్థించుకుంటోంది. 11 జిల్లాలు, 30 తాలూకాలలో 83,536 కుటుంబాల రేషన్ కార్డుల రద్దుకు ఆదేశాలిచ్చింది. ఆయా జిల్లాలో గిరిజ కుటుంబాలు ఎక్కువ. ముఖ్యంగా వన్సదా గిరిజనులపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంత డిప్యూటీ కలెక్టర్ మమలత్దార్ వాసవ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తున్నాం. ఇందులో చెప్పేందుకు ఏముందని అన్నారు. స్థానిక రేషన్ దుకాణదారుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తాలూకాలోని 3600 కుటుంబాలపై ప్రత్యక్ష ప్రభావం ఉంటుందని చెప్పారు. గిరిజన/ఆదివాసీ కుటుంబాలకే నష్టం ఎక్కువన్నారు. రేషన్ కార్డును ప్రభుత్వం జారీ చేస్తుంది, అదే రద్దు చేస్తుంది.. కానీ నా లాంటి దుకాణదారులపై అలా చేసేందుకు ఒత్తిడి తెస్తుండటం ఇబ్బందికరమని ఆయన అన్నారు. వన్సదాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అనంత్ పటేల్ స్పందిస్తూ 'ఇక్కడి గిరిజన ప్రాంతాల్లో ఉండేవారంతా నిరుపేదలు. రెక్కలు ముక్కలు చేసుకుంటే తప్ప పూటగడవని స్థితిలో బతుకుంటారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.